Crime Mirror
QR Code
https://epaper.
crimemirror.com/

# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
25-9-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 325

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## మూసీ నిర్వాసితులకు

# డబుల్ ఇళ్లు

### జీవో విడుదల చేసిన ప్రభుత్వం

### నిర్మాణాలకు నష్టపరిహారం చెల్లింపు

### అధికారులతో సిఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో నిర్వాసితులకు 16,002 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీలో 10,200 మంది నిర్వాసితులు కానున్నట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు. బుధవారం ఇంటింటికి వెళ్లి ఇళ్ల కేటాయింపు వివరాలను నిర్వాసితులకు తెలియజేయనున్నారు.

మిగతా 2లో

# హైడ్రా కూల్చివేతల్లో సామాన్యుల సమిధలు

### సిఎం సోదరుడికి మాత్రం మినహాయింపులు

### కోర్టు నుంచి స్టే తెచ్చుకునేలా వెసలుబాటు

### ఇంటింటికి వెళ్ళి కండువాలు కప్పి చేర్చుకోలేదా

### ఎమ్మెల్యే గాంధీని మావాడు అంటూ ఇంకా బుకాయింపులా

### పార్టీ సమావేశంలో మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైడ్రా అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి టార్గెట్‌గా చేసుకుని కేటీఆర్ కామెంట్స్ చేశారు. వారికి కోర్టుకు వెళ్లేలాగా పరిస్థితి కల్పించి సామాన్యుల ఇళ్లు మాత్రం కూల్చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్‌కేజీ చదివే వేదశ్రీకి తన పుస్తకాలు తీసుకునే సమయం కూడా ఇవ్వలేదు.. 50 ఏళ్ళ కస్తూరి బాయి తన జీవనాధారమైన చెప్పుల దుకాణం కోల్పోయింది.. 72 గంటల క్రితం కొన్న ఇల్లు నేల మట్టమైంది.. వారం ముందు గృహప్రవేశం చేసుకున్న ఇల్లు, అన్ని కాగితాలు ఉన్నా .. పేక మేడలా కూల్చివేయబడింది.. తిరుపతి రెడ్డి గారు.. క్షణం కూడా సమయం ఇచ్చే ప్రసక్తే లేదన్న హైడ్రా.. మీ విషయంలో నోరు మెదపలేదు.. వాల్టా అనుకుంటా.. ఏకంగా మీకు 30 రోజుల టైం ఇచ్చింది.. కోర్టులో స్టే సంపాదించుకున్నారు.. ప్రస్తుతం జరుగుతున్న కూల్చివేతల రావణకాష్టంలో మట్టి కూడా అంటనిది బహుశా మీకు మాత్రమేనా.. బుల్‌డోజర్ల కింద నలిగిపోతున్న సామాన్యులకు ఆ కిటుకేదో చెప్పండని అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

# హిందువులంతా ఏకం కావాలి

### సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఉపేక్షించను

### హిందువులు కనీసం కోపం తెచ్చుకోకపోతే ఏం చేయగలం?



సెక్యులరిజం వన్‌వే కాదు టూ వే

అల్లా, జీసస్‌ను ఎవరైనా.. ఏమైనా అనగలరా?

సున్నితాంశాలపై ప్రకాశ్‌రాజ్ తెలుసుకొని మాట్లాడాలి

ఉప ముఖ్యమంత్రి పవన్ వ్యాఖ్యలు

**విజయవాడ, (క్రైమ్ మిర్రర్):** సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఘాటుగా హెచ్చరించారు. తప్పు జరిగిందంటే ప్రాయశ్చిత్తం చేసుకోండి.. లేకుంటే మౌనంగా ఉండాలంటూ వైసీపీ నాయకులకు చురకలంటించారు.

- మిగతా 2వ పేజీలో



# కర్ణాటక సీఎంకు షాక్

ముడా స్కాంలో సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు రాష్ట్ర హైకోర్టు ఓకే

గవర్నర్ అనుమతిని సవాల్ చేస్తూ ముఖ్యమంత్రి వేసిన పిటిషన్ కొట్టివేత

సిద్దూ రాజీనామాకు బీజేపీ డిమాండ్

నేడు కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం

హైకోర్టు తీర్పుపై సుప్రీంలో సవాల్?


నేడు కాంగ్రెస్ శాసనసభాపక్ష భేటీ

# ట్రిపుల్ ఆర్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

### చౌటుప్పల్ జంక్షన్ రింగు విస్తీర్ణాన్ని పెంచొద్దు

### గతంలో కోమటిరెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలి

### హరీశ్‌రావును కలిసిన ట్రిపుల్ ఆర్ బాధితులు



హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు (ట్రిపు ల్ ఆర్) భూ సేకరణలో నష్టపోతున్న రైతులు, బాధితులకు న్యాయం చేయాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన హామీని సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. ట్రిపుల్ ఆర్‌తో నష్టపోతున్న రైతులు మంగళవారం హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్ భరోసా ఇవ్వడంతో పాటు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. 'బాధితులకు న్యాయం చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో సాక్షాత్తూ భువనగిరి సభలో ప్రియాంకాగాంధీ హామీ ఇచ్చారు.

- మిగతా 2వ పేజీలో

## ప్రజలకు అందుబాటులో ఉండని నేత కెసిఆర్

అధికారం ఉన్నా..విపక్షంలో ఉన్నా ఒకటే తరహా

ఇకముందు ప్రజలను నమ్మించడం సాధ్యం కాదు

కెసిఆర్ తీరుపై సర్వత్రా విమర్శలకు ఇదే కారణం

మిగతా 3లో

## తెలంగాణకు రెండురోజులు వర్ష సూచన

హైదరాబాద్: మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం బలపడింది. సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళ,బుధ వారాల్లో

మిగతా 2లో

## ఔటర్ దాటుతున్న హైడ్రా చర్యలు

### సమీప చెరువుల రక్షణకు ప్రణాళిక

### క్షేత్రస్థాయి పరిశీలనతో ఆక్రమణదారులకు దడ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్‌తో పాటు నగరంతోపాటు నగరం చుట్టూ ఉన్న చెరువుల సంరక్షణపై హైడ్రా పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తోంది.

## మూసీ నిర్వాసితులకు డబుల్ ఇళ్లు

మరోవైపు రివర్ బెడ్ ఆక్రమణలో ఉన్న 1,600 ఇళ్లను అధికారులు తొలగించనున్నారు. మూసీ బఫర్ జోన్‌లో నివసించే వ్యక్తులు, నిర్మాణాలకు పరిహారం చెల్లించనున్నారు. ఈ క్రమంలో చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపుపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, మెట్రో రైలుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఆక్రమిత చెరువులు, నాలాలతోపాటు మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే పేదల వివరాలు సేకరించాలని, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు లేదా ప్రత్యామ్నాయం చూపించాలని ఆదేశించారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలకు గురి కాకుండా పర్యవేక్షించేందుకు చెరువుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూసీ ఒడ్డున కూల్చివేతలకు ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ షురూ చేసింది. యాక్షన్ ప్లాన్ పై సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి పలువురు అధికారులు భేటీ అయ్యారు. మూసీపై 13వేల అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మూసీ నివాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మూసీని ఆక్రమించి ఉన్న నిర్మాణాల తొలగింపు బాధ్యత హైడ్రాకు అప్పగించింది. ఈ క్రమంలో.. కూల్చివేతల సందర్భంగా నివాసితులు నుంచి వ్యతిరేకత రాకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టింది అధికార యంత్రాంగం. ప్రభుత్వం పూర్తి స్థాయి భరోసా కల్పించిన తర్వాత.. హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగనున్నాయి. కాగా.. నగరంలో అక్రమ కట్టడాల కూల్చివేతలే లక్ష్యంగా హైడ్రా దూసుకెళ్తోంది. ఇప్పటికే పలుచోట్ల అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది.

# హైడ్రా కూల్చివేతల్లో సామాన్యల సమిధలు

అలాగే రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటింటికి వెళ్లి కాళ్లు మొక్కి కండువాలు కప్పిన సన్నాసి వెధవ ఎవడు..? అని శ్రీధర్ బాబును కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. చెరువు నిండితే కప్పలన్నీ వస్తాయని సామెత ఉండేది.. మనం ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాం.. అధికారంలో లేం.. మీ ఎమ్మెల్యే జంపు కొట్టిండు. కానీ ఇవాళ 150 మందితో సమావేశం అనుకుంటే.. వెయ్యి మందికిపైగా వచ్చారంటే శేరిలింగంపల్లి పోరాట స్ఫూర్తికి వందనం చేస్తున్నాను అని కేటీఆర్ తెలిపారు. త్వరలోనే శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉప ఎన్నిక వస్తుంది. బరాబర్ మళ్లీ ప్రజలు బుద్ధి చెబుతారు. అరికెపూడి గాంధీకి పార్టీ ఏం అన్యాయం చేసింది. ఎందుకు పోయావంటే సమాధానం లేదు. మంత్రి శ్రీధర్ బాబు అతి తెలివిగా మాట్లాడుతుండు. ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్లాడుకొని మమ్మల్ని అంటున్నరని అంటుండు. నేను ఒక్కటే అడుగుతున్నా శ్రీధర్ బాబును.. అతి తెలివి ప్రదర్శిస్తున్న మంత్రి గారూ.. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే మావోడు కాదు.. మీ వోడు అంటున్నవ్.. కొద్దిసేపు నీవు అంటున్నది నిజమే అనుకుందాం.. మరి ఆయనకు కండువా కప్పిన సన్నాసి వెధవ ఎవరు..? బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కడియం శ్రీహరి, సీనియర్ నేత కే కేశవరావు ఇంటికి వెళ్లి కాళ్లు మొక్కి కండువాలు కప్పిన దౌర్భాగ్యుడు, సన్నాసి వెధవ ఎవడు..? చెప్పు శ్రీధర్ బాబు దమ్ముంటే. చెప్పుకునేందుకు కొంత సిగ్గుమానం ఉండాలి అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

## తెలంగాణకు రెండురోజులు వర్ష సూచన

తెలంగాణలో కొన్ని జిల్లాలలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురిసే చాన్సుందని వాతావరణ కేంద్రం తెలిపింది.గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. కొమరంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్గొండ ,రంగారెడ్డి,వికారాబాద్,సంగారెడ్డి,మెదక్, కామారెడ్డి,మహబూబ్ నగర్,నాగర్కర్నూల్,వనపర్తి,నారాయణపేట,జోగులాంబ గద్వాలకు భారీ వర్షసూచన ఉంది.దీంతో ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

# అమృత్ టెండర్లపై వదిలిపెట్టేది లేదు

### ప్రాజెక్టుల టెండర్ల పేరుతో కుట్రలకు తెర

### ముడుపులు వచ్చే పనులపై రేవంత్ దృష్టి

### ప్రకటన విడుదల చేసిన మాజీమంత్రి కెటిఆర్




**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే భారీగా ముడుపులు వచ్చే కార్యక్రమాలపైన దృష్టి పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్లకుంట్ల తారక రామారావు ఆరోపించారు. అమృత్ టెండర్లపై మరోమారు కేటీఆర్ విమర్శలు చేశారు. ఈ మేరకు

మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల టెండర్ల పేరుతో కుట్రకు తెర లేపారని ఆరోపణలు చేశారు. అధికారంలోకి వచ్చిన ఒకటి రెండు నెలల్లోనే తాను గతంలో బాధ్యతలు నిర్వహించిన మున్సిపల్ శాఖలో సీఎం రేవంత్ వివిధ పనులకు టెండర్లు పిలిచారని అన్నారు. 26 పురపాలక పట్టణాల్లో తాగునీటి ప్రాజెక్టులు సీవరేజ్ పనులకు సుమారు 9000 కోట్ల రూపాయల టెండర్లు పిలిచారని తెలిపారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీన టెండర్ల గడువు పక్రియ పూర్తయిందని కేటీఆర్ పేర్కొన్నారు.ఈ టెండర్లలో సీఎం రేవంత్‌కు సంబంధించిన కంపెనీలను దొడ్డి దారిన ప్రవేశపెట్టి పనులు అప్పగించారు. అందుకే ఈ మొత్తం వ్యవహారం తాలూకు సమాచారాన్ని ప్రభుత్వం ఏ వెబ్‌సైట్లోనూ ఉంచలేదు. ఇన్ని వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు పనుల టెండరింగ్ పక్రియ పూర్తి అయిన ఇప్పటిదాకా ప్రభుత్వం నుంచి ఒక్క పత్రిక ప్రకటన కూడా రాలేదు. ఏయే ప్రాంతాల్లో పనులను పిలిచారు. ఎక్కడ ఏ ఏ కంపెనీలకు టెండర్లు దక్కాయి. టెండర్ పనుల విలువ వంటి ఏ సమాచారాన్ని కూడా ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంచలేదు. అయితే టెండర్లు దక్కించుకున్న ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ స్టాక్ లిస్టెడ్ కంపెనీ కావడంతో... వారికి దక్కిన టెండర్ల తాలూకు సమాచారాన్ని సెబీకి ఇవ్వాల్సి వచ్చింది. దీంతో ఈ టెండర్ల స్కామ్ బయటకు వచ్చింది. ఈ కంపెనీ సెబీకి ఇచ్చిన సమాచారం ప్రకారం రూ.1137 కోట్ల టెండర్లను సంస్థ దక్కించుకుంది అని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ టెండర్లలో 80శాతం పనులను మరో రెండు కంపెనీలకు జాయింట్ వెంచర్ రూపంలో ఇస్తున్నట్లు తెలిపింది. ఈ రెండు కంపెనీల్లో ఒక కంపెనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వయానా బావమరిది సూదిని సృజన్ రెడ్డి సంస్థ అయిన శోధా కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఈ కంపెనీకి ఈ జాయింట్ వెంచర్‌లో భాగస్వామ్యం ఉంది. ఈ కంపెనీకి ఎలాంటి అర్హతలు లేకపోవడంతో నేరుగా టెండర్లలో పాల్గొనలేదు. ఈ ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీపైన ఒత్తిడి తీసుకువచ్చి టెండర్లు వేయించి అందులో 80? పనులను ముఖ్యమంత్రి బావమరిది ఆయన బినామీ కంపెనీలకు అప్పచెప్పారు. ఈ శోధా కన్స్ట్రక్షన్ కంపెనీకి ఆర్థిక సామర్థ్యం కూడా లేదు.

# హిందువులంతా ఏకం కావాలి



సనాతన ధర్మంపై పోరాటం చేయగలిగితే నన్నెవరూ ఆపలేరన్నారు. ఈ నేల అన్ని మతాలను గౌరవిస్తుందని, ధర్మానికి విఘాతం కలిగినప్పుడు అందరూ మాట్లాడాలని చెప్పారు. తప్పు చేసిన వాళ్ల నాశనం మొదలైందని చెప్పారు. తిరుమల లడ్డూలో కల్తీ నేపథ్యంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన పవన్ కల్యాణ్.. విజయవాడ కనకదుర్గ ఆలయంలో శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇంద్రకీలాద్రి దుర్గమ్మ సన్నిధిలో మెట్లను శుభ్రం చేశారు. ఆ తర్వాత మెట్లకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మెట్ల పూజ చేశారు. అనంతరం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఈ దేశంలోని సగటు హిందువుకు వేరే మతం, వ్యక్తి మీద ద్వేషం ఉండదు. సనాతన ధర్మం పాటించే వ్యక్తులు ఇతర మతాలను గౌరవిస్తారు. వైసీపీ పాలనలో ఆలయాల్లో తప్పు జరిగిందని చెబితే అపహాస్యం చేసేవారు. హైందవ ధర్మాన్ని కాపాడతామని సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి బాధ్యత తీసుకు న్నారు. అపవిత్రం జరిగిందంటే బాధ్యత ఉన్న వ్యక్తులు సమాధానం చెప్పాలి. నాపై విమర్శలు కాదు.. అపవిత్రం జరిగిందని తెలిసినప్పుడు మీ బాధ్యతేంటి?. లడ్డూ ప్రసాదంలో అపవిత్రం జరిగిందంటే చాలా ఆవేదన కలుగుతోంది. సాటి హిందువులు.. తోటి హిందువులను దూషించడం మంచి పద్ధతి కాదు. బాధ్యత తీసుకున్న వాళ్లనే నేను నిందిస్తున్నా. ఇప్పటికీ వైసీపీ నేతలు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సున్నిత అంశాలపై పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యలు బాధాకరం. తిరుమల లడ్డూపై ఆయన ఢిల్లీలో మాట్లాడారు. ఇలాంటి పరిస్థితుల్లో మౌనం దాటి పొగరుగా మాట్లాడితే ఊరుకునేది లేదు. విమర్శించే వైసీపీ నాయకులకు చెబుతున్నా.. సనాతన ధర్మం జోలికి రావద్దు. తప్పు జరిగితే ఒప్పుకోండి. లేకపోతే సంబంధం లేదని చెప్పండి. అంతేగాని అడ్డగోలుగా మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టంగా చెబుతున్నా. పొన్నవోలు కూడా హిందువే.. నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం. అపవిత్రం జరిగినప్పుడు మాట్లాడితే తప్పా?. అని ప్రశ్నించారు. నటుడు ప్రకాశ్‌రాజ్‌కు కూడా చెబుతున్నా.. మీరంటే మాకు గౌరవం ఉంది. సున్నిత అంశాలపై విషయం తెలుసుకుని మాట్లాడాలి. సెక్యులరిజం అంటే సనాతన ధర్మానికి విఘాతం కలిగినా నోరు మూసుకుని కూర్చోవాలా అని ప్రశ్నించారు. ఇస్లాం, క్రిష్టియన్ మతాల్లో ఇలాగే జరిగితే ఊరుకుంటారా..వారిని నోరుమూయించగలారా అన్నది ఆలోచించాలన్నారు. ప్రకాశ్‌రాజ్‌తో పాటు అందరికీ చెబుతున్నా.. విమర్శలకు ముందు ఏం జరిగిందో తెలుసుకోండి. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు. తప్పు జరిగిందంటే ప్రాయశ్చిత్తం చేసుకోండి. లేకుంటే

మౌనంగా ఉండండి. తప్పు చేసిన వాళ్ల నాశనం మొదలైంది. విచారణకు రావాలంటే సుబ్బారెడ్డికి రికార్డులు ఇవ్వాలట. మీరు ప్రభుత్వంలో ఉన్నప్పుడు మాకు రికార్డులు ఇచ్చారా?. ధర్మారెడ్డి ఎక్కడో కనిపించట్లేదు. తిరుమలను ఇష్టారాజ్యంగా మార్చేశారు. సనాతన ధర్మంపై పోరాటం చేయగలిగితే నన్నెవరూ ఆపలేరు. ఈ నేల అన్ని మతాలను గౌరవించేది. ధర్మానికి విఘాతం కలిగినప్పుడు అందరూ మాట్లాడాలి' అని పవన్ కల్యాణ్ అన్నారు. సగటు హిందువుకు ఎలాంటి భయం, ఇతర మతాల పైన ద్వేషం ఉండదు. కనకదుర్గమ్మ రథం సింహాలు మాయమైతే వైసీపీ నేతలు అపహాస్యం చేశారు. వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి మతం పుచ్చుకున్నారా లేదా నాకు తెలీదు. జగన్‌ను నేను ఎత్తి చూపడం లేదు... మీ సమయంలో జరిగిన అపచారంపై స్పందించాలని అన్నారు. సెక్యూలరిజం అన్ని వైపుల నుంచి రావాలన్నారు. సాటి హిందువు లు తోటి హిందువులను తిట్టడం ఆక్షేపణీయమన్నారు. మసీదులో చిన్న అపచారం జరిగితే ఇలాగే మాట్లాడతారా.. హిందువుల పట్ల ఎలా మాట్లాడతారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యులరిజం టూవే.. ఒన్ వే కాదు.. ప్రకాష్ రాజ్ అంటే గౌరవం ఉంది.. కానీ ఆయన సరిగా మాట్లాడాలి. సనాతన ధర్మంపై దాడి జరిగినప్పుడు మాట్లాడకూడదా. మేం చాలా బాధపడ్డాం.. మీకు ఇది ఇదంతా హాస్యం కావచ్చు. మాకు ఇదంతా చాలా బాధను కలిగించింది. ఇష్టానికి సనాతన ధర్మం పై మాట్లాడుతున్నారు. మీరు సరస్వతీ దేవి, దుర్గాదేవిలపై జోకులు వేస్తారా. సనాతనధర్మ రక్షణ అనేది గుడికెళ్ళే ప్రతీ హిందువు బాధ్యత కాదా. పొన్నవోలు మదమెక్కి మాట్లాడుతున్నారు. నా మీద కోర్టులో కేసులేసుకోండి.. సనాతన ధర్మం గురించి మాట్లాడితే రోడ్లమీదకు లాగుతాం' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ధర్మారెడ్డి హిందువా.. బిడ్డ చనిపోయిన పదకొండు రోజుల్లోపు గుడికి వచ్చేస్తారా. ఇస్లాం, ముస్లింలకు జరిగితే ఇలాగే ఉంటారా. సనాతన ధర్మం కోసం పోరాటం చేస్తే.. చనిపోవడానికి సిద్ధం నేను. మీ ప్రభుత్వాన్ని పడకొట్టిన మేము.. ఏమీ చేయలేం అనుకుంటున్నారా. మీ మౌనంతో తరాలు నాశనం అయిపోతాయి.. భారతదేశపు సినిమా అభిమానులు అందరూ హిందువులు కాదా. ఇస్లాం మీద గొంతెత్తితే రోడ్లమీదకు వచ్చి కొడతారని మీకు భయం. ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా సైలెంట్‌గా ఉండాలి... మాట్లాడితే చాలా మంచిగా మాట్లాడాలి. నిన్న సినిమా ఫంక్షన్ లో లడ్డు గురించి మాట్లాడారు అంటూ పవన్ ఘాటుగా వ్యాఖ్యలు చేశారు.



## ఔటర్ దాటుతున్న హైడ్రా చర్యలు

కొన్ని తటాకాల విషయంలో అధికారులు హద్దులు మార్చినట్లు, తప్పుడు పత్రాలు సృష్టించినట్లు హైడ్రా విచారణలో తేలింది. వాటిని చట్టపరంగా ఎదుర్కొ నేందుకు కమిషనర్ రంగనాథ్ కేంద్ర ప్రభుత్వ సంస్థ సాయం తీసుకోబోతున్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఎన్ఆర్ఎస్సీ నుంచి 45 ఏళ్ల నాటి ఉపగ్రహ చిత్రాలను సేకరించేందుకు సిద్ధమయ్యారు. హైడ్రా, ఎన్ఆర్ఎస్సీ మధ్య త్వరలో ఒప్పందం జరగనుంది. ఇప్పుడు వెనకడుగు వేస్తే.. నగరంలో మిగిలిన అరకొర చెరువులు కూడా కబ్జా అవుతాయని, యుద్ధప్రాతిపదికన వాటిని రక్షించాల్సిన అవసరం ఉందని హైడ్రా భావిస్తోంది. లక్ష్యం నెరవేరే వరకు వెనకడుగు ఉండదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.సరైన ఆధారాలతో కూల్చివేతలు చేపట్టినప్పుడే పనులు లక్ష్యం ప్రకారం కొనసాగుతాయని హైడ్రా భావిస్తోంది. అందులో భాగంగా ఇటీవల కమిషనర్ రంగనాథ్ బాలానగర్‌లోని ఎన్ఆర్ఎస్సీ కేంద్రాన్ని సందర్శించారు. శాస్త్రవేత్తలతో హైడ్రా కార్యక్రమాలను పంచుకున్నారు. చెరువుల రక్షణకు సాయం కావాలని అడిగారు. అధికారికంగా చెరువుల హద్దులను నిర్ణయించి, స్పష్టమైన పటాలను ఇవ్వాలని కోరారు. కొందరు అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చినట్లు తెలుస్తోంది. అలాంటి సందర్భాల్లో ఎన్ఆర్ఎస్సీ పటాలు ఉపయోగపడతాయి. అధికారికంగా వాటిని కొనుగోలు చేస్తామని, త్వరగా ఏర్పాటు చేయాలని శాస్త్రవేత్తలను కోరాం అని రంగనాథ్ వివరించారు. ఎన్ఆర్ఎస్సీ సంస్థ ఇప్పటికే హైడ్రా అభ్యర్థన మేరకు 56 చెరువుల పటాలను అందజేసింది. 1979-2023 ఏళ్ల మధ్య చెరువులు ఏ విధంగా ఆక్రమణకు గురయ్యాయో చిత్రాలతో సహా వివరించింది. అనేక తటాకాలు కొన్ని రోజుల్లో కనుమరుగవుతాయని చెప్పడమే వాటి ఉద్దేశం. ఆయా పటాలను మరింత పక్కాగా రూపొందించి, హద్దులను నిర్ణయించాలని తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశోధన సంస్థను కోరడం గమనార్హం. ఈ క్రమంలో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా గతంలో ఉన్న చెరువులు నాలాలు గుర్తించి త్వరగా చర్యలు చేపట్టబోతున్నారు. ఈ క్రమంలో చెరువుల రక్షణపై మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోబోతున్నారు.

## కర్ణాటక సీఎంకు షాక్

(మొదటి పేజీ తరువాయి)

బెంగళూరు: కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు హైకోర్టు షాక్ ఇచ్చింది. మైసూర్ పట్టణాభివృద్ధి సంస్థ(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు కుంభకోణంలో సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. గవర్నర్ ఇచ్చిన అనుమతిని సవాల్ చేస్తూ సిద్దరామయ్య వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. సిద్దరామయ్య భార్య పార్వతి అక్రమమార్గంలో ముడా నుంచి 14 ఇంటి స్థలాలు పొందారని, ఆమె నుంచి ముడా సేకరించిన భూమి కంటే వీటి విలువ ఎన్నో రెట్లు అధికమని సామాజిక కార్యకర్త టీజే అబ్రహాం, ప్రదీప్‌కుమార్, స్నేహమయి కృష్ణ గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన గవర్నర్.. సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతి ఇచ్చారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీఎం సిద్దరామయ్య హైకోర్టులో వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం నెలరోజులపాటు విచారించి మంగళవారం తీర్పు ఇచ్చింది. సిద్దరామయ్య పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. సీఎం ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతించడం సమంజసమైనదని తీర్పులో స్పష్టం చేసింది. సీఎం కుటుంబసభ్యులు లబ్ధి పొందిన విషయం కావడంతో విచారణ జరగాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. సీఎం సిద్దరామయ్యకు వ్యతిరేకంగా హైకోర్టులో తీర్పు రావడంతో కర్ణాటక రాజకీయాలలో కలకలం ఏర్పడింది. బెంగళూరు నగర పర్యటనలో ఉన్న సిద్దరామయ్య హుటాహుటిన అధికారిక నివాసం కావేరికి చేరుకున్నారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు ఎంబీ పాటిల్, శివరాజ్ తంగడిగ, కృష్ణబైరేగౌడ, బైరతి సురేశ్ తదితరులు కూడా హుటాహుటి కావేరికి చేరుకున్నారు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కావేరికి చేరుకుంటున్నారు. ఓ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లిన శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ కూడా బెంగళూరుకు బయల్దేరినట్లు సమాచారం. హైకోర్టు తీర్పు మేరకు సీఎం ప్రాసిక్యూషన్‌ను ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావడంతో కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని సూర్జేవాలా భరోసా ఇచ్చారు. న్యాయపోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. తద్వారా రాజీనామా చేయాల్సిన అవసరం లేదని అధిష్ఠానం పరోక్షంగా సందేశమిచ్చింది. సిద్దరామయ్య పిటిషన్‌ను హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తిరస్కరించడంతో ఆయన హైకోర్టు ఉన్నత ధర్మాసనం లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. ఏకసభ్య ధర్మాసనం తీర్పు అనంతరం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి, మరో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో ఫోన్‌లో చర్చించారు. ఈ తీర్పును

## ములుగు మున్సిపల్ బిల్లును ఆమోదించండి

### గవర్నర్‌ను కలిసి విన్నవించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ములుగు మున్సిపాలిటీ బిల్లును తక్షణం ఆమోదించాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రి సీతక్క కోరారు. గత ప్రభుత్వ హయాంలోనే దీనిని మున్సిపాలిటీగా చేశారని గుర్తు చేశారు. ఈ మేరకు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మారుస్తూ 2022లో అసెంబ్లీ పాస్ చేసిన బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని గవర్నర్‌కు సీతక్క వినతి పత్రం సమర్పించారు.



సాంకేతికపరమైన చిక్కులతో ములుగు మున్సిపాలిటీ బిల్లు ఇంతకాలం పెండింగ్‌లోనే ఉండిపోయిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ తప్పిదాలతో మున్సిపాలిటీకి ములుగు నోచుకోని పరిస్థితి. తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లులోనే ములుగు మున్సిపాలిటీ అంశాన్ని గత ప్రభుత్వం చేర్చింది. అదే బిల్లులో జీహెచ్‌ఎంసీ చట్టానికి సవరణలు ప్రతిపాదించింది గత సర్కార్. దీంతో ములుగు మున్సిపాలిటీ బిల్లు గందరగోళంగా మారిపోయింది. సభ్యుల గందరగోళం నడుమ 2022లో బిల్లును అప్పటి ప్రభుత్వం పాస్ చేసింది. అయితే న్యాయపరమైన, సాంకేతికపరమైన అంశాల నేపథ్యంలో బిల్లును గత గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్ రాష్ట్రపతి ఆమోదానికి పంపించారు. దీంతో ములుగు మున్సిపాలిటీ బిల్లు పెండింగ్‌లోనే ఉండిపోయింది. ఈ క్రమంలో బిల్లు వివరాలు గవర్నర్‌కు అందజేసిన మంత్రి సీతక్క.. ములుగుకు మున్సిపాలిటీ హోదా కల్పించే బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు అందుబాటులో ఉండని నేత కెసిఆర్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కెసిఆర్ సామాన్యులకు అందుబాటులో ఉండడన్న విషయం అధికారంలో ఉన్నప్పుడే అందరికీ తెలుసు. అలాగే అధికారం కోల్పోయినా అలాగే వ్యవహరిస్తున్నారు. ఉద్యమ సమయంలో కూడా అదే ధోరణి కనబర్చారు. ఆయన నేరుగా ప్రజలను కలుసుకునే వీలు లేకుండా తన వైఖరిని ధృడపర్చుకున్నారు. అందుకే ప్రజలు ఆయనను కలవడానికి అవకాశం లేదు. ప్రజలను కలవకుండా,నేతలతో చర్చించకుండా బలమైన నేతగా ఎక్కువ కాలం మనలేరని కూడా రుజువు చేసుకు న్నారు. గత పదేళ్ల ఆయన పాలనలో తనకు తానుగా నిర్మించుకున్న ఇనుపగోడల కారణంగా ప్రజల అవసరాలను గుర్తించలేక పోయారు. సమస్యలను ప్రస్తావిస్తే దాటవేతలు లేదా విమర్శలు ఎక్కువయ్యాయి. తెలంగాణ ఏర్పడ్డది మొదలు ప్రజల పక్షాలన నిలిచి పనులు చేసుకుంటూ పోతే ఇవాళ బిఆర్ఎస్ ఇంతగా ఇతర పార్టీలను విమర్శించాల్సిన అవసరం ఏర్పడేది కాదు. ప్రజలను పట్టించుకుని ఉంటే తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన నేతగా కెసిఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. కానీ దాదాపు పదేళ్ల పాటు భరించారు. లాభం లేదనుకుని తీర్పు ఇచ్చారు. దీనిని బిఆర్ఎస్ నేతలు అర్థం చేసుకోవడం లేదు. తమ పదేళ్ల కాలంలో అంతా బ్రహ్మాండంగా చేశామని డప్పు కొట్టుకుంటున్నారు. అందుకే అదేపనిగా విమర్శల ద్వారా ప్రజల్లో ఉండాలని చూస్తున్నారు. వీరు గతంలోనే ప్రజలకు దగ్గరగా ఉంటే ఆ పార్టీని ప్రజలు విస్మరించేవారూ కాదు. కానీ పరిస్థితి పూర్తి భిన్నంగా



ఉంది. ఇంకా కాంగ్రెస్,టిడిపి, బిజెపిలను తిడుతూ, సెంటిమెంట్‌ను రెచ్చగొడుతూ పోతే ఓట్లు రాలే పరిస్థితి ఇప్పుడు కూడా లేదు. ఆరుదశాబ్దాల వివక్ష కారణంగా దెబ్బతిన్న తెలంగాణ ప్రాంతానికి నూతన దిశానిర్దేశం చేయడానికి, చరిత్రలో ఒక విశిష్ట నాయకుడిగా నిలవడానికి వచ్చిన అవకాశాలను కెసిఆర్ తనకు తానుగా చేజార్చుకున్నారు. ఎందరో బలిదానాలు చేస్తే తెలంగాణ రాష్ట్రం సిద్ధించినా, ఆ విజయం తనదేనని కెసిఆర్ అన్నా ఎవరుకూడా పెద్దగా అభ్యంతరం చెప్పలేదు. ఒక ఆశయం కోసం సుదీర్ఘపోరాటం జరిపి, దాని విజయాన్ని ప్రజలంతా కెసిఆర్ చేతిలో పెట్టారు. అయితే కెసిఆర్ సిఎం అయ్యాక అధికారాన్ని సంఖ్యాబలాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రజలకు పింఛన్లు, తాయిలాలు ఇస్తూ సాదాసీదా నాయకుడిగా మిగిలిపోయారు. ప్రజలు ఇలాంటి పందారాలను కోరుకోలేదు. పనులు చేయాలని చూశారు. హామీలను అమలు చేసి కొత్త తెలంగాణకు తెరతీయాలని చూశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం ఆయన కులవృత్తులకు ఆర్థిక సాయం అందించినా అది ఓట్ల కోసం చేస్తున్న ప్రయత్నంగా నిరూపితమయ్యింది. ఓటుకునోటు పథకాలు అమలవు తున్నాయన్న భావన ప్రజల్లో ఏర్పడింది. చెరువుల పూడికతీత అంతా ఆర్భాటపు ప్రచారంగా సాగింది. మిషన్ భగీరథ కూడా అంతే. ఇలాంటి వాటి ద్వారా లబ్ది పొందాలనుకున్నప్పుడు పటిష్టంగా కార్యక్రమాలు అము చేసి ఉంటే బాగుండేది. అవేవీ చేయకుండా కేవలం కేంద్రాన్ని,ఎదుటి వారిని తిట్టడం ఇప్పుడు రాజకీయ ప్రచారంగా మారింది. విమర్శలతో ఒనగూరే ప్రయోజనం సున్నా బిఆర్ఎస్ నేతలు తెలుసుకోవాలి. సమస్యలను గుర్తించి ముందుకు సాగాలి. కెసిఆర్ కూడా ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావాలి. తమ హయాంలో జరిగిన తప్పులను గుర్తించి చర్చించాలి. అప్పుడే ప్రజలు నమ్ముతారు.




## సన్నాలు, దొడ్డు వడ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సన్నాలు, దొడ్డు వడ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో 60.39 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారని, 146.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి చెప్పారు. 40 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలకు గోదాములను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఖరీఫ్ నుంచి సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యం కొనుగోలు చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని మిల్లర్లను హెచ్చరించారు. ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన ఈ సమీక్షలో.. 2024-25 వానా కాలం మార్కెటింగ్ సీజన్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గింజా కొనుగోలు చేస్తుందన్నారు. అందుకు 7,139 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

## ప్రజారోగ్యంపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం

### ఎక్స్‌లో కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ప్రజల ఆరోగ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు గుప్పించారు. ఎవడి చావు వాడు చస్తాడని, తమకేం సంబంధం అన్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తిస్తోందని చురకలంటించారు. మంగళవారం కెటిఆర్ తన ట్విట్టర్ లో ట్వీట్ చేశారు. జనాలు రోగాలు, నొప్పులు, వ్యాధులతో బాధలు పడుతుంటే జనానికి చలనం లేదని ఎద్దేవా చేశారు. జనాలు జ్వరంతో చస్తుంటే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కెటిఆర్ దుయ్యబట్టారు. విష జ్వరాలు విజృంభించి ప్రజలు ఒళ్లు, ఇళ్లు గుల్ల చేస్తుంటే పట్టించుకునే నాథుడే కనిపించడంలేదన్నారు. బస్తీలకు సుస్తీ చేసిందని, పల్లెలు మంచం పట్టినా కూడా వైద్యారోగ్య శాఖకు చీమకుట్టినట్టు కూడా లేదని చురకలంటించారు. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, ప్రభుత్వ శాఖలు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదని కెటిఆర్ మండిపడ్డారు. ప్రాణాంతక రోగాలు పట్టి పీడిస్తుంటే అరికట్టాల్సిన ప్రభుత్వం అడ్రస్ లేదని ఎద్దేవా చేశారు.

## భార్యాభర్తల మధ్య గొడవ

### ఉరేసుకుని భర్త ఆత్మహత్య

**సూర్యాపేట,(క్రైమ్ మిర్రర్):** ప్రేమ పెళ్లి చేసుకున్నాక దంపతులు మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో భర్త ఇంట్లో ఉరేసుకొని చనిపోయిన సంఘటన సూర్యాపేట జిల్లా బాణాపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బాణాపురం గ్రామానికి చెంది బాణాల శ్రీనివాస్, బరాఖత్ గూడానికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. శ్రీనివాస్ హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి వారు ప్రేమ వివాహం చేసుకున్నారు. గత కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు రావడంతో భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. బరాఖత్ గూడాకు వెళ్లి భార్యను కాపురానికి రమ్మని అడిగాడు. భార్యతో గొడవ తారాస్థాయికి చేరుకోవడంతో అక్కడి నుంచి అతడు బాణాపురం వచ్చాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో శ్రీనివాస్ ఉరేసుకున్నాడు. శ్రీనివాస్ తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో ఐటి దాడులు

### బొల్లా రామకృష్ణ నివాసంలో సోదాలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్‌లో మరోసారి ఐటీ రైడ్స్ కలకలం రేపాయి. ఉదయం ఐదు గంటల నుంచి ఓ న్యూస్ ఛానల్ అధినేత ఇళ్లు, కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, బంజారాహిల్స్ చెక్‌పోస్టు, మాదాపూర్‌ని ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు చేస్తున్నారు. బొల్లా రామకృష్ణ న్యూస్ ఛానల్‌తోపాటు ఫైనాన్స్, హాస్పిటల్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. ఐటి ఎగవేతల కారణంగానే తనిఖీలు చేస్తున్నారు. వచ్చిన ఆరోపణలు ఏంటని మాత్రం బయటకు రావడం లేదు. దాదాపు పది మంది అధికారుల బృందం ఉదయం ఐదు గంటల నుంచి ఆయన నివాసాలు, కార్యాలయాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రస్తుతం బొల్లా రామకృష్ణ కూకట్‌పల్లిలోని రెయిన్‌బో విస్టాస్ ఐ బ్యాక్‌లో నివాసం ఉంటున్నారు. అక్కడ కూడా అధికారులు సోదాలు చేపట్టారు. ఎవర్నీ అటుగా వెళ్లనీయడం లేదు.

## హెచ్‌సిఎ టెండర్ ప్రక్రియపై విచారణ

### ఎంపి చామల కిరణ్ కుమార్ డిమాండ్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో టెండర్ పక్రియ, రవాణా సేవలు సహా ఇతర కాంట్రాక్టు వ్యవహారాలపై దర్యాప్తు జరపాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి విజిలెన్స్ అదనపు డీజీకి లేఖ రాశారు. క్యాటరింగ్, రవాణా సేవల కోసం టెండర్ పక్రియపై యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. ఇది అసోసియేషన్ పనితీరును ప్రభావితం చేస్తోందన్నారు. అపెక్స్ కౌన్సిల్‌తో సరైన సంప్రదింపులు లేకుండా నిర్ణయాధికారాలు కొంతమంది(అధ్యక్ష, సెక్రటరీ) వ్యక్తుల చేతుల్లోనే ఉన్నాయన్నారు. టెండర్ లేకుండా ఐపీఎల్ కాంట్రాక్టులు ఇవ్వడం వంటి నిర్ణయాలు హెచ్‌సీఏ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తాయన్నారు. హెచ్‌సీఏలో న్యాయబద్ధత, జవాబుదారీతనాన్ని నిర్ధరించేందుకు అన్ని టెండర్లలో సరైన పక్రియను అనుసరించడం చాలా అవసరమని లేఖలో పేర్కొన్నారు. ఆదాయం, వ్యయానికి సంబంధించిన పారదర్శకత లేకపోవడం బాధాకరమన్నారు. దీంతోపాటు మ్యాచ్‌ల సమయంలో రద్దీని క్రమబద్ధీకరించేందుకు, భద్రతను మెరుగుపరచడానికి ఉప్పల్ స్టేడియంలో మల్టీలెవల్ పార్కింగ్ అవసరమన్నారు. ఈ

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

### వరదనీటితో వాహనదారుల ఇక్కట్లు

### తెలంగాణలో రెండ్రోజులు వాన హెచ్చరిక



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదారాబాద్ మహా నగరంలో పలు చోట్ల వర్షం కురిసింది. తార్నాక, ఓయూ క్యాంపస్, లాలాపేట, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, దిల్‌సుఖ్‌నగర్, చంపాపేట్, సైదాబాద్, సరూర్‌నగర్, కోఠి, చాంద్రయణగుట్ట, మాదాపూర్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్ సిటీలో ఎప్పుడు.. ఎంత వర్షం పడుతుందో ఎవరికీ అర్థం కావటం లేదు. అప్పటికప్పుడు మారిపోతున్న వాతావరణంతో.. కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షం పడుతుంది. సోమవారం సాయంత్రం.. హైదరాబాద్ సిటీలోని కొత్తపేట, చైతన్యపురి ఏరియాల్లో కుండపోత వాన పడింది. గంటపాటు దంచికొట్టింది. కుండపోత వర్షానికి చైతన్యపురి, కొత్తపేట ఏరియాల్లోని వీధులు అన్నీ జలమయం అయ్యాయి. ఇవి రోడ్లా లేక నదులా అన్నట్లు మోకాళ్ల లోతు నీళ్లు ప్రవహించాయి. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం.. పిల్లలు స్కూల్స్, ట్యూషన్ల నుంచి ఇంటికి చేరే సమయం కావటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీధుల్లో మోకాళ్ల లోతు నీటితో వాహనదారులు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఎక్కడ మ్యాన్ హోల్ ఉంది.. ఎక్కడ గుంతలు ఉన్నాయి అనేది తెలియక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల వాహనాలు నీటిలో మునిగిపోయాయి. రోడ్లపై వెళు తున్న వాహనాలు ఆగిపోయాయి. దీంతో వాహనదారులు.. జోరు వర్షంలో.. మోకాళ్ల లోతు నీటిలోనే తోసుకు వెళ్లటం కనిపించింది. ఇకపోతే తెలంగాణలోని పలు జిల్లాల్లో రెండ్రోజులు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న మూడు రోజులు ఉరుములు మెరుపులతోపాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. పశ్చిమ-మధ్య బంగాళాఖాతం వద్ద, మయన్మార్ దక్షిణ తీరం దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న రెండు ఆవర్తనాలు ఈరోజు విలీనమై మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంగా ఏర్పడుతుందని వాతావరణ కేంద్రం సంచాలకులు పేర్కొన్నారు. ఇది సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ. ఎత్తులో కొనసాగుతుందన్నారు. దీని ప్రభావం కారణంగా రాగల 24 గంటల్లో పశ్చిమ -మధ్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో అల్ప పీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు.

## అమృత్‌లో అవినీతిపై సివిసి విచారణ అవసరం

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు డ్రామాలాడుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. అమృత్‌లో జరిగిన అవినీతి బయటకు రావాలంటే సీవీసీ విచారణను కోరాలని డిమాండ్ చేశారు. దేశంలోని పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చే ఒక సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని ప్రవేశపెడితే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతూ ఈ పథకం ప్రయోజనాలు ప్రజలకు అందకుండా చేస్తున్నాయని విమర్శలు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకంలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడి తమకు కావాల్సిన వాళ్లకే కాంట్రాక్టులు కట్టబెట్టిందని బీఆర్ఎస్ ఆరోపిస్తుంటే, గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ ప్రత్యారోపణలు చేయడం దొందుదొందే అన్న విధంగా ఉందన్నారు. కాంగ్రెస్ 6 గ్యారంటీల అమలులో వైఫల్యాలపై ప్రజల దృష్టి మళ్లించేందుకు వీరిరువురూ సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకుంటూ డ్రామా చేస్తున్నారని దుయ్యబట్టారు. అమృత్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని, కాంట్రాక్టు కట్టబెట్టడంలో పక్షపాతం చూపలేదని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తే తక్షణమే సీవీసీకి లేఖ రాయాలన్నారు. లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడినట్టు భావించాల్సి వస్తుందని అన్నారు. సీవీసీ లేఖ రాస్తే దీనిపై విచారణ జరిపేందుకు సీవీసీని ఒప్పించేలా నేనే వ్యక్తిగతంగా చొరవ చూపుతానని తెలిపారు.

## భద్రాచలంలో గంజాయి అక్రమ రవాణా

### నిజామాబాద్ ఎంఐఎం కార్పొరేటర్ కొడుకు అరెస్ట్

**భద్రాచలం,, (క్రైమ్ మిర్రర్):** భద్రాచలంలో గంజాయి అక్రమ రవాణా పట్టుబడింది. భారీగా గంజాయిని తరలిస్తున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎంఐఎం కార్పొరేటర్ కొడుకుతో పాటు మరో కేసులో తల్లి కొడుకు కూడా పట్టుబడ్డారు. నాలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడిగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణ ఎక్సైజ్ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఈ ఘటనలో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుని.. 10 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరిలో నిజామాబాద్ ఎంఐఎం పార్టీ కార్పొరేటర్ కుమారుడు మహమ్మద్ మునవర్ అలీ ప్రధాన నిందితుడు కావడం విశేషం. గత కొన్నేళ్లుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో పోలీసులు కన్నుగప్పి గంజాయి అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. వీరి వద్ద నుంచి సుమారు కోటి రూపాయల విలువైన 319 కేజీల గంజాయిని మరియు రెండు కార్లు, రెండు బైకులు, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి అక్రమ రవాణాలో నిజామాబాద్ ఎంఐఎం పార్టీ కార్పొరేటర్ కుమారుడైన మునావర్ ఆలీతో పాటు మరో కుటుంబం పూర్తిగా గంజాయి వ్యాపారంలో మునిగి తేలుతుంది. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నేరేళ్ల అరుణ, ఆమె కుమారుడు నేరెళ్ల అఖిల్ ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దు నుంచి 100 కేజీల గంజాయిని తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. తల్లీ కొడుకులు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడడం విశేషం. నేరెళ్ల అరుణ భర్త కూడా సదయ్య గంజాయి వ్యాపారం చేస్తూ అనేకసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్



## ఎడిటోరియల్




## కల్తీనెయ్యిపై పెరుగుతున్న ఆందోళన

**తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంతో ఇప్పుడు సీబీఐతో విచారణ జరిపించాలన్న డిమాండ్ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలను గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం కూడా సీబీఐ విచారణకు వెంటనే అనుమతిచ్చి చిత్తశుద్ధిని చాటుకోవాలి. మాజీ సిఎం జగన్, ఆయన పరివారం ఈ వ్యవహారాన్ని రాజకీయ కోణంగా చూస్తూ చంద్రబాబుపై బురదజల్లడం ద్వారా, తమ తప్పులను కప్పి పుచ్చుకోవాలని చూస్తున్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు.**

జగన్ ప్రధానికి రాసిన లేఖ ద్వారా ఆయన కుయత్నాలు అర్థం చేసుకోవచ్చు. ఆయన సొంత చెల్లెలు, పిసిసి చీఫ్ షర్మిల కూడా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నందున సిబిఐ విచారణ జరపాలని కోరుకుంటున్నారు. ఈ మేరకు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం కూడా సమర్పించారు. గత ఐదేళ్లలో తిరుమలలో పరిస్థితి వికటించింద నడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. స్వామివారి సేవను విస్మరించి అప్పటి ముఖ్యమంత్రి సేవలో కింది నుంచి పై వరకూ తరించిపోయారు. తిరుమలకు ఉన్న విశిష్టతను మంటగలిపారు. టీటీడీలో పనిచేస్తున్న సిబ్బందిలో భయం, భక్తి సన్నగిల్లింది. అవినీతి స్వైర విహారం చేసింది. దేవుడి సన్నిధిలో అవినీతికి పాల్పడటం మహాపాతకం అన్న పాపభీతి కూడా లేకుండా పోయింది. తిరుమల కొండను సర్వ పాపాలకూ వేదికగా మార్చేశారు. దేవదేవుడిని భక్తి, నమ్మకంతో కాకుండా స్వార్థం కోసం వాడుకున్నారు. ఇంత కాలానికి పాపం పండింది. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్టుగా కల్తీ నెయ్యితో అసలు విషయం బయటపడింది. ఆవు నెయ్యి కల్తీ జరిగిన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడిస్తే..దానివల్ల జరిగిన నష్టాన్ని గుర్తించి, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాల్సిన జగన్,ఆయన భజయ బృందం ఎదురుదాడి విమర్శలు చేయడం వారి కుహనా రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. రోజాలాంటి వారు కూడా విమర్శలు చేస్తున్నారే తప్ప, దేవదేవుడికి అపచారం జరిగితే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం లేదు. వ్యవహారం బయటపడగానే దేశ విదేశాలకు చెందిన భక్తులు మండిపడ్డారు. ఆవు నెయ్యిలో పంది కొవ్వు నుంచి తీసిన నూనె కలిపారని నిర్ధారణ కావడంతో కేంద్ర ప్రభుత్వం కూడా ఉలిక్కిపడింది. ఇంతకాలంగా తాము జంతువుల కొవ్వుతో చేసిన నెయ్యితో తయారుచేయించిన లడ్డూలను తిన్నామా! అని భక్తులు తీవ్ర మానసిక ఆవేదన చెందారు. ఈ మహాపాతకానికి పాల్పడిన వారిని కఠినాతికఠినంగా శిక్షించాల్సిందే అన్న డిమాండ్ ప్రపంచవ్యాప్తంగా వస్తోంది. అందువల్ల సిబిఐ విచారణ జరగాల్సిందే. మార్కెట్ ధరలో సగం ధరకే నెయ్యి సరఫరా చేయడానికి ముందుకు వచ్చిన సంస్థలను ఆహ్వానించి.. వారికే టెండర్లను కట్టబెట్టిన వారందరినీ శిక్షించాలి. తిరుమల లడ్డూ విశిష్టతను, పవిత్రతను కాపాడలేక పోయిన ప్రతి ఒక్కరినీ ఇందులో దోషులుగా చేర్చాలి. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారు? వారికి కలిగిన ప్రయోజనం ఏమిటో కూడా నిగ్గు తేల్చాలి. కల్తీ నెయ్యి సరఫరా చేసిన కంపెనీని బ్లాక్ లిస్ట్ చేస్తున్నామని ప్రస్తుత ఈవో శ్యామలరావు చెప్పారు. బ్లాక్ లిస్ట్ చేయడం కాదు.. భక్తుల మనోభావాలతో ఆడుకున్న ఆ కంపెనీ యజమానిని కఠినంగా శిక్షించాల్సిందే. కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వివరణ, చేస్తున్న వాదన అంతా వ్యవహారాన్ని పక్కదారి పట్టించేదిగా ఉంది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తుండటంతో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తెరమీదకు తెచ్చారని ఆయన వాదించడం ద్వారా హిందువుల మనోభావాలను మరింత దెబ్బతీస్తున్నారు. శ్రీవారికి భక్తులు ఎప్పటి నుంచో సమర్పించిన కానుకల్లోని విలువైన వాటిని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తస్కరించుకుపోయారని, వాటిని కరకట్టపై ఉన్న ఆయన నివాసంలో దాచిపెట్టారని ఎంపీ విజయసాయిరెడ్డి అప్పట్లో తీవ్ర ఆరోపణలు చేసారు. మాజీ ప్రధానార్చకులు రమణదీక్షితులు వంటి వారు వంత పాడారు. ఇప్పుడు తత్వం బోధపడిన అదే రమణదీక్షితులు గత ఐదేళ్లుగా కొండపై జరిగిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని అంటున్నారు. రమణదీక్షితులు కూడా రాజకీయాల్లో తలదూర్చడం దారుణం కాక మరోటి కాదు. తిరుమల శ్రీవారు తనవద్ద జరుగుతున్న అపచారాలను ఇంతకాలం భరించారు. ఏదో ఒక రూపంలో బయటకు తీసుకుని వచ్చారు. అందువల్ల ప్రభుత్వం కూడా సిబిఐతో విచారణ చేయించి భక్తులకు నమ్మిక కలిగించాలి.

# తిరుమల పవిత్రతను సవాల్‌గా తీసుకోవాలి !



తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం కాస్తా రాజకీయ విమర్శలకు దారితీయడం దారుణం. నిజానికి ఇక్కడ భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. కోట్లాది మంది హిందువులను దారుణంగా మోసం చేశారు. జగన్ హయాంలో నెయ్యి కల్తీ జరిగిందన్న విషయం తేలినందున..ఎవరు కల్తీ చేశారో..గుర్తించాలి. ఆ సంస్థపై చర్య తీసుకోవాలి. కల్తీ నెయ్యి సరఫరా జరుగుతున్నదని తెలిసీ ఎందుకు ఇలా చేశారన్నది కూపీ లాగాలి. హైందవేతరులు టిటిడి ఛైర్మన్‌గా ఉన్నందున వారికి దేవుడిపైనా, ఆలయ పవిత్రతపైనా పెద్దగా పట్టింపులు, నమ్మకాలు లేకపోవచ్చు. ఇప్పుడు చంద్రబాబు తిరుమల విషయంలో ఓ ప్రత్యేక చట్టం చేసి పవిత్రతను కాపాడేందుకు రంగంలోకి దిగాలి. హైందవేతరులు ఎవరు కూడా తిరుమల బోర్డు ఛైర్మన్లుగా, సభ్యులుగా ఉండకుండా చట్టం తీసుకుని రావాలి. తిరుమలకు సంబంధించినంత వరకు అన్యమత ఉద్యోగులు అక్క పనిచేయకుండా నిర్ణయం తీసుకోవాలి. అలా ఎవరైనా ఇప్పటికీ ఉంటే వారిని పంపించి వేయాలి. తక్షణ కర్తవ్యంగా ఈ పనిచేసి దెబ్బతిన్న భక్తుల మనోభావాలకు ఉపశమనం కలిగించాలి. ఇక నెయ్యి విషయంలో కూడా తిరుమల మరో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దేవదేవుడికి కోట్లాది రూపాయల సంపత్తి ఉంది. గోశాలలు ఉన్నాయి. గోవులు ఉన్నాయి. భక్తులు గోవులను దానం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. అందువల్ల టిటిడి ఆధ్వర్యంలో గోశాలలను నిర్వహించాలి. ప్రత్యేక నెయ్యి, పాల ఉత్పత్తులను తయారు చేసుకునే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టాలి. దీంతో గో సంరోణ కూడా జరగగలదు. తిరుమల శ్రీనివాసుడికి డబ్బుల కొదవ లేనందున గోవుల పెంపకం పెద్ద కష్టమేమీ కాదు. శ్రీవారి లడ్డూకున్న పవిత్రతను కాపాడేందుకు ఈ కీలక నిర్ణయం తీసుకోవాలి. తిరుమల ప్రసాదాల నాణ్యత పెంచాలి. ఆచారాలను మరింత పకడ్బందీగా కొనసాగించాలి. రాజకీయాలకు దూరంగా తిరుమల వ్యవహారాలను నడించాలి. తిరుమలో లడ్డూ మొదలుకుని ఏ ప్రసాదం రుచి చూసినా..అద్భుతంగా ఉంటుంది. అది మరోచోట దొరకదు. కానరాదు. ఇదంతా ఆ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి మహత్యం అని శ్రీవారి భక్తులు విశ్వసిస్తారు. శతాబ్దాలుగా తన ప్రాశస్త్యం నిలుపుకొంటూ వచ్చిన లడ్డూను నాణ్యతను గత జగన్‌రెడ్డి ప్రభుత్వం దెబ్బతీయగలిగింది. వారి స్వార్థం కోసం తిరుమలను దుర్వినియోగం చేశారు. టిటిడి ఛైర్మన్లుగా క్రిష్టియన్లను నియమించినా సనాతన హిందూ ధర్మ సంస్థలు నోరు మెదపలేదు. అలాగే ఇటీవలి కాలంలో లడ్డూ నాణ్యత దారుణంగా పడిపోయింది. గతంలో తిరుమల లడ్డూ ఘుమఘుమ లు వెదజల్లేవి. ఈ మధ్య కాలంలో ఆ ఘుమఘుమలు మాయమయ్యాయి. లడ్డూ కూడా ఎండిపోయినట్టుగా ఉంటోంది. ఇలా జరగడానికి తిరుమల తిరుపతి దేవస్థానం గత పాలకవర్గం నిర్వాకమే కారణం. నాసిరకం నెయ్యితో పాటు జీడిపప్పు, కిస్మిస్‌లు కూడా నాణ్యమైనవి వాడకపోవడంతో లడ్డూ తన రుచిని,నాణ్యతను కోల్పోయింది. ఇప్పుడు లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో కల్తీ జరిగిందని తేలింది. ఈ మహా పాతకానికి ఎవరు కారణం అన్నది తేల్చాలి. కాంట్రాక్టర్లను ఎందుకు మార్చారన్నది తేలాలి. గత పాలక మండలి రేటు తగ్గించిన కారణంగా నెయ్యి సరఫరాదారులు కల్తీ నెయ్యి సరఫరా చేశారు. నాణ్యమైన ఆవు నెయ్యిని పేరొందిన కంపెనీలు బహిరంగ మార్కెట్‌లో కిలో 800 రూపాయల వరకు విక్రయిస్తుండగా టీటీడీ పాలక మండలి మాత్రం రూ.400 కంటే తక్కువకు నెయ్యి టెండర్లను ఖరారు చేసింది. ఈ తప్పుడు నిర్ణయం కారణంగానే కల్తీ నెయ్యి సరఫరా అయింది. మహా ప్రసాదాన్ని కలుషితం చేసి భక్తుల మనోభావాలను దారుణంగా దెబ్బతీశారు. ఆ దేవదేవుడికి అపచారం చేశారు. శ్రీవారిపై భయం ఉన్నవాళ్లు ఇలా చేయరు. ఇంతటి దారుణానికి ఒడిగట్టరు. కాసుల కక్కుర్తి కారణంగా ఈ ధరలకు దిగారని తెలుసుకోవచ్చు. భక్తుల సొమ్ము


తోనే ప్రసాదాలకు అవసరమైన ముడి సరుకులను కొనుగోలు చేస్తారు. ఇందులో నాణ్యత విషయంలో రాజీపడి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. అలాంటప్పుడు ఇలా ఎందుకు చేశారన్నది విచారణ చేయించాలి. నెయ్యి కల్తీ జరిగిందా? లేదా? అని నిర్ధారించే ల్యాబ్‌లు తిరుపతిలో లేవు. అందుకే ఇష్టా రాజ్యంగా కల్తీ నెయ్యి సరఫరా సాగింది. నాటి పాలక మండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి,ఈవో ధర్మారెడ్డి.. అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కోసం ఆ దేవదేవుడిని ముడిసరుకుగా వాడుకున్నారు. గత ఐదేళ్లుగా రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో శ్రీవారి సన్నిధిలో అవినీతి పేరుపోయింది. విఐపి టిక్కెట్లను కూడా అమ్ముకున్నారంటే ఎంతకు దిగజారారో తెలుసుకోవచ్చు. నాణ్యమైన నెయ్యి కావాలంటే తక్కువ ధరకు ఇవ్వలేమని పేరున్న సంస్థలు స్పష్టం చేసినప్పుడు..ఇతరులు తక్కువకు సరఫరా చేస్తామంటే ఒప్పు కోవడంలోనే గోల్‌మాల్ జరిగింది. కనీస పాపభీతి కూడా లేకుండా దేవుడిపైన నమ్మకంతో భక్తులు సమకూర్చిన సొమ్ముకే కన్నం వేశారు. కమీషన్ల పర్వానికి తెరలేపారు. ప్రముఖులకు దేవుడిపై ఉన్న భక్తిని ఆసరాగా చేసుకొని వ్యక్తిగత పలుకుబడి పెంచుకున్నారు. మొత్తంగా తిరుమలను కలుషితం చేశారు. ఈ క్రమంలో పాలక మండలిలో సభ్యులుగా నియమితులవడానికి పోటీ పెరిగిపోయింది. శ్రీవెంకటేశ్వరుడిపై భక్తితో కాకుండా ఆ దేవదేవుడిని సొంత అవసరాలకు వాడుకోవడానికి ఎంతైనా ఇచ్చి పాలక మండలి సభ్యులుగా నియమితులు కావడానికి కొందరు ప్రయత్నించారు. క్రమంగా టీటీడీ ఛైర్మన్ పదవి కూడా రాజకీయ పునరావాస కేంద్రంగా మారిపోయింది. అందువల్ల ఈ పద్దతికి ఇక స్వస్తి పలకాలి. సంస్కణలకు శ్రీకారం చుట్టాల్సిన బాధ్యత చంద్రబాబుదే. తాను శ్రీవారి దయతోనే బతికి బయటపడ్డానని చెబుతున్న చంద్రబాబు తక్షణం హైందవేతరులు, రాజకీయనేతలను టిటిడి ఛైర్మన్ సహా ఇతర పదవులకు దూరంగా ఉంచాలి. హైందవేతర ఉద్యోగులను, దేవుండటే నమ్మకం లేని వారిని అక్కడి నించి పంపించేయాలి. అతిపెద్ద డెయిరీని కేవలం గోవులతో నిర్వహించేలా చేయాలి. అప్పుడే తిరుమల పవిత్రతకు భంగం కలగదు. మొత్తంగా తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ప్రక్షాళనకు చంద్రబాబు నడుం బిగించాలి. ఇదో పవిత్ర యజ్ఞంగా చూడాలి.

(ఆధ్యాత్మిక చింతన)

## భక్తిలేని చోట..పవిత్రత ఉండదు

**ఈశా ఫౌండేషన్ సంస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్**

తిరుపతి ప్రసాదంలో బీఫ్ టాలో ఉందన్న వార్త అసహ్యాన్ని కలిగించిందని ఈశా ఫౌండేషన్ సంస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్ చెప్పారు. హిందూ దేవాలయం భక్తులచే నిర్వహించబడాలి కానీ ప్రభుత్వాల ఆధీనంలో ఉండకూడదన్నారు. ఈ సంఘటన అసహ్యకరమైనదని.. భక్తులకు ఇచ్చిన ప్రసాదంలో జంతు కొవ్వు కలిసి ఉండడం మహాపరాధంగా పేర్కొన్నారు. హిందూ దేవాలయాల పవిత్రతను కాపాడుకోవడానికి వాటిని భక్తులు ఆధీనంలో ఉంచాలని ఉద్ఘాటించారు. అందుకే భక్తులే ఆలయాలు నడిపాలని.. ప్రభుత్వాలు గుడులపై తమ పెత్తనాన్ని విడనాడాలని తామంతా కోరేదన్నారు. వివాదాన్ని ప్రస్తావిస్తూ, సద్గురు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్ లో పోస్ట్ చేసారు. గొడ్డు కొవ్వు కలిసిన ప్రసాదం హిందూ భక్తులు తినేలా చేయడం అసహ్యాన్ని కలిగించేది. అందుకే దేవాలయాలు ప్రభుత్వ పాలనలో కాకుండా భక్తుల ఆధీనం నడవాలి. భక్తి లేని చోట పవిత్రత ఉండదు. హిందూ దేవాలయాలు ప్రభుత్వ పరిపాలన ద్వారా కాకుండా భక్తులైన హిందువులచే నిర్వహించబడమే మంచిది. అని ఆయన రాసుకొచ్చారు. ప్రఖ్యాత తిరుపతి దేవస్థానంలోని ప్రసాదంలో బీఫ్ టాలో మిళితమైందని వచ్చిన వార్తలకు ప్రతిస్పందనగా ఆయన ఈ ట్వీట్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల నిరసనల మధ్య, హిందూ దేవాలయాల పవిత్రత, సమగ్రతను కాపాడే లక్ష్యంతో ఆలయ నిర్వహణను తిరిగి భక్తులకే ఇవ్వాలన్న డిమాండ్స్ పెరుగుతున్నాయి.



## జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర

ప్రస్తు రాజకీయ తరుణంలో సీతరాం ఏచూరి లేని లోటు కనిపిస్తుందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం ఉండాలి. అదికూడా నిబద్దత కలిగిన నాయకుడి అధ్యక్షుడిగా ఉంటే మంచిది. జాతీయ రాజకీయాల్లో ఇప్పుడు ఆ లోటు కనిపిస్తోంది. నిగ్గదీసే నిబద్ధ రాజకీయాలు కరువయ్యాయి. ఈ తరుణంలో సీతరాం ఏచూరి మరణం జాతీయ రాజకీయాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఇది సిపిఎం లేదా లెఫ్ట్ రాజకీయాలకు కూడా వర్తిస్తుంది. దేశ జాతీయ రాజకీయాలు కీలకమైన మలుపులో వున్న ఈ తరుణంలో సీతారాం ఏచూరి అకాల మరణం సిపిఎంకి పెద్ద ఎదురుదెబ్బ. మొత్త వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకికవాద శక్తులకు తీరని నష్టం.దోపిడి రహిత సమాజం కోసం జరిపే పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళేం దుకు ఏచూరి ఎంతగానో కృషి చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న నిరణయాల్లో మంచివి,చెడువీ ఉంటున్నాయి. ఇలాంటి సందర్భాల్లో మంచిని మంచిగా, చెడును చెడుగా విశ్లేషించే నాయకుడుగా ఏచూరి లేకపోవడం ప్రజలకు కూడా పెద్ద లోటుగానే భావించాలి. తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో పోరాడుతూ ఇక్కడి ఎయిమ్స్‌లో ఆయన గత గురువారం కన్నుమూశారు. పార్టీ అగ్ర నేతల్లో ఒకరైన ఏచూరి వామపక్ష ఉద్యమ విశిష్ట నేతల్లో అగ్రగణ్యులు. ప్రముఖ మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త కూడా. ఆర్థిక శాస్త్రంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ రెండింట్లో ప్రధమ శ్రేణిలో ఉత్తీర్ణులైన తెలివైన విద్యార్థి. 1974లో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో విద్యార్థి ఉద్యమంలో ఆయన చేరారు. ఆ తర్వాత ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడయ్యారు. కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు ఎన్నికయ్యారు. 1984 నుండి 1986 వరకు ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడిగా పనిచేశారు. విద్యార్థి సంఘాన్ని అఖిల భారతస్థాయిలో ఒక శక్తిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. 1975లో సీతారాం ఏచూరి సిపిఎంలో చేరారు. ఆయన చేపట్టిన రాజకీయ కార్యకలాపాల కారణంగా ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయ్యారు. 1985లో పార్టీ 12వ మహాసభల్లో కేంద్ర కమిటీకి ఎన్నికైన ఆయన చివరి వరకు కొనసాగారు. 1989లో కేంద్ర కార్యదర్శివర్గానికి ఎన్నికయ్యారు. 1992లో పార్టీ 14వ మహాసభల్లో పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. 2015లో పార్టీ 21వ మహాసభల్లో సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఏచూరి చివరి వరకు అదే పదవిలో కొనసాగారు. మూడు దశాబ్దాలకుపైగా కేంద్ర పార్టీ నాయకత్వ బృందంలో భాగంగా ప్రతీసారీ పలు అంశాలపై పార్టీ రాజకీయ వైఖరులను రూపొందించడంలో ముఖ్య భూమిక పోషించారు. సైద్దాంతిక విభాగంలో సీతారాం ఏచూరి విశిష్టమైన పాత్ర పోషించారు. సోషలిజానికి ఎదురుదెబ్బలు తగలడంతో పార్టీ సైద్దాంతిక వైఖరులను రూపొందించిన 14వ మహాసభల్లో నిర్దిష్టమైన సైద్దాంతిక అంశాలపై పార్టీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని కామ్రేడ్ సీతారాం ఏచూరి రూపొందించి మహాసభ ముందుంచారు. ఆ తర్వాత, 2012లో పార్టీ 20వ మహాసభల్లో సైద్దాంతిక వైఖరులను సవరించిన తీర్మానాన్ని మొదటగా బలపరిచింది కూడా ఏచూరే. తదనంతరం



ఆ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. పార్టీ కేంద్ర కమిటీ అంతర్జాతీయ విభాగాధిపతిగా ఏచూరి వివిధ అంతర్జాతీయ కమ్యూనిస్టు, ప్రగతిశీల శక్తుల వేదికలపై పాల్గొన్నారు. సోషలిస్టు దేశాలతో సంబంధాలను బలోపేతం చేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించారు. ఆయన స్వయంగా మంచి రచయిత కూడా. 2005 నుండి 2017 వరకు రెండుసార్లు ఆయన రాజ్యసభ సభ్యుడిగా వున్నారు. సిపిఎం గ్రూపు నాయకుడిగా వున్న ఆయన సమర్ధవంతమైన పార్లమెంటేరియన్‌గా తనను తాను నిరూపించు కున్నారు. ఎన్నో సమస్యలను నిర్మొహమాటంగా లేవనెత్తేవారు. ఛలోక్తులతో ప్రబుత్వాన్ని విమర్శించేవారు. విధానపర నిర్ణయాల్లో ఆయన రాజీలేని వైఖరితో మోడీ ప్రభుత్వాన్ని ఎండగట్టారు. 2017లో ఆయనకు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు లభించింది. ఇటీవలి కాలంలో సీతారాం ఏచూరి, లౌకిక ప్రతిపక్ష పార్టీల మధ్య విస్తృత ఐక్యత కోసం తన సమయాన్ని, శక్తిని ప్రధానంగా వెచ్చించారు.

# తుక్కుగూడ మున్సిపాలిటీలో హర్షగూడ విలీనం



హర్షం వ్యక్తం చేసిన హర్షగూడ గ్రామస్తులు




**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం తుకుగూడ మున్సిపాలిటీలో మరోగ్రామాన్ని విలీనం చేసిన ప్రభుత్వం.గతంలో గ్రామపంచాయితీగా ఉన్న హర్ష గూడ ఇప్పుడు తుక్కుగూడ మున్సిపాలిటీలో విలీనం చేసారు. తెలంగాణ రాష్ట్ర కమిషనర్ డైరక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో పిఆర్ఓసి నం.720450/2024/ఎఫ్1ప్రకారం హర్షగూడ గ్రామపంచాయితీని తుక్కుగూడ పురపాలక సంఘంలో విలీనం చేసారు. హర్ష గూడ గ్రామపంచాయతీ రికార్డులను 23వ.తేదీ సోమవారం జాయింట్ డైరక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాంటేకార్ మధుమోహన్,వైస్ చైర్ పర్సన్భవాని వెంకట్ రెడ్డి ఎంపిడిఓ పి.శైలజ రెడ్డి మున్సిపల్ కమీషనర్ బి.వెంకట్ రామ్ మేనేజర్ టి.పర్వతాలు,వెంకటేష్ ఆర్ ఐ.మల్లేష్,కౌన్సిల్ సభ్యులు కొప్పుల పద్మ శివయ్య,జాపాల భావన సుధకర్,హర్ష గూడ పంచాయతీ కార్యదర్శి మనీషరెడ్డి,హర్ష గూడ మాజీ సర్పంచ్ పాండు నాయక్,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,గ్రామా యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం..

## గత పాలకులు గ్రామాలను గాలికి వదిలేశారు..





**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి నియోజకవర్గ నిఘా ప్రతినిధి:** కల్వకుర్తి నియోజకవర్గనికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని చెప్పుకోవడానికే తప్ప గత పాలకుల నిర్వాకం తో అభివృద్ధి లో శూన్యంగా మారింది. మాడ్గుల మండలం సరిహద్దు ఫిరోజ్ నగర్ గ్రామం నుండి కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి పోయే ప్రధాన రహదారి చినుకు పడిందంటే చెరువులను తలపిస్తున్నవి.గత ప్రభుత్వం లో నాయకులు చెప్పిన మాటలు పేపర్లకే అంకితం అయ్యవీ తప్ప అభివృద్ధి కీ నోచుకోలేదని ప్రజలు టిఆర్ఎస్ నాయకుల పై మండిపడుతున్నారు. గతం లో ప్రతి సంవత్సరం బోనాలు, తండాల్లో తీజ్ పండుగలకు మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా ఫోటో పోజుల కోసం హాజరు అయ్యాడే తప్ప రాష్ట్రంలో అధికారంలో ఉండి కూడా గ్రామాల్లో రోడ్డు లను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మాజీ కేంద్రమంత్రి దివంగత నాయకులు సుధీని జైపాల్ రెడ్డి పుట్టిన గడ్డ ని అన్ని రంగాల్లో ముందుకు తీసుక పోతమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కల్వకుర్తి లో జరిగిన పలు బహిరంగ సభలలో హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడవకముందే యేండ్ల తరబడి శిథిల వ్యవస్థలో ఉన్న ఆమనగల్ ప్రభుత్వ దావఖనని 10 పడకల నుండి 100 పడకలకు పెంచుతూ నిర్మాణం పనులు మొదలు పెట్టారు. ఎన్నికల సమీపంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కే ఎల్ ఐ కాలువ ధ్వారా భూములు కోల్పోయిన రైతులకు గత ప్రభుత్వం లో పెండింగ్ వున్నా కోట్ల రూపాయలు నిధులను ముఖ్యమంత్రి ధ్వారా విడుదల చేయించడం పై మాడ్గుల మండల రైతులు హర్ష వ్యక్తం చెస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చిత్ర పాటలకు క్షిరాభి షేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 5 సంవత్సరాల కాలం లో కల్వకుర్తి నియోజకవర్గం రూపు రేఖలు మారుతావని విద్యావంతులు,మేధావులు భవిస్తున్నారు.గుంతల మయంగా మారిన రోడ్డు ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ చూపి కాల పరిమితి అయిపోయిన బీటీ రోడ్డు లకు కొత్త టెండర్లు నిర్వహించి నూతన బీటి రోడ్డు లను నిర్మాణం చేసి వాహన దారుల ఇబ్బందులను తొలగించలని చరికొండ, ఫిరోజ్ నగర్, ముద్విన్ ఇరు గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.



# వ్యాస రచన పోటీల్లో లార్డ్స్ విద్యార్థిని ప్రతిభ

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మీర్పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని లార్డ్స్ పాఠశాల విద్యార్థిని వ్యాస రచన పోటీల్లో జిల్లాలో రెండవ స్థానం సాధించిన మనోజ్ఞను లార్డ్స్ విద్య సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప అభినందించారు. చదువుతో పాటు మనోవిజ్ఞాన పోటీలలో పాల్గొనేలా చిన్ననాటి నుండి అలవాటు పడేలా లార్డ్స్ విద్యాసంస్థలు ఎంతో ప్రాముఖ్యతను ఇస్తుందని, పాఠశాల స్థాయి నుండి జిల్లా స్థాయి వెళ్లినందుకు కృషి చేసినటువంటి ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. వైస్ చైర్మన్ భైర్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు మనోవిజ్ఞాన పోటీలలో మంచి ప్రతిభ కనపరిచేలా కృషి చేస్తున్నాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ పాఠశాల డైరెక్టర్ సిద్దాల శ్రీలత, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మరియన్, ఉపాధ్యాయులు అభినందించారు.

# నాంపల్లి పోషణ్ అభియాన్ పోషణ మాసం కార్యక్రమాల నిర్వహణ

### సీజన్ వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ప్రభుత్వ వైద్యాధికారి తరుణ్



పోషణ్ అభియాన్ పోషక మాసం కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అస్రత్ ఉన్నీస ఆదేశానుసారం మంగళవారం నాంపల్లి మండల పరిధిలోని పెద్దాపురం గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ తరుణ్ మాట్లాడుతూ శనివారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో, సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా ఈ వారం రోజులు వరకు పోషణ్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో 8వ తరగతి నుండి పదో తరగతి పిల్లలకు హిమోగ్లోబిన్ రక్త పరీక్ష నిర్వహించి, రక్తహీనత ఉన్న పిల్లలకు దాని కారణంగా వచ్చే జబ్బుల గురించి అవగాహన కల్పించడం జరిగింది. విద్యార్థులకు రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహార్దాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఎమ్ శ్రీనివాసులు సహాయ సంచాలకులు సర్వే ల్యాండ్ రికార్డ్స్, ఎంపీడీవో మేరీ స్వర్ణలత, ఎం పి ఓ ఆఫీసర్, పాఠశాలల సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి పేరుతో మోసం... యూ ట్యూబర్ హర్షసాయిపై కేసు.

గండిపేట్(క్రైం మిర్రర్): పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన ఓ యూ ట్యూబర్‌పై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యూ ట్యూబ్‌లో పలు కార్యక్రమాలు చేస్తూ పోస్టు చేస్తున్న హర్షసాయి. తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని బిగ్ బాస్ కంటెస్టెడ్ మిత్రా శర్మ ఫిర్యాదు చేసిందన్నారు. హర్షసాయితో పాటు అతడి తండ్రిపై సైతం ఫిర్యాదు చేసిందన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి రెండు కోట్లు తీసుకున్నాడని పేర్కొన్నారు. హర్షసాయి హీరోగా మెగా అనే మూవీని మిత్రా శర్మ నిర్మించారు. అడ్వకేట్‌తో కలిసి నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు 328,376,354,376, సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.






బాలాపూర్ గణనాథుడి లడ్డును వేలంపాటలో 30 లక్షలకు కైవసం చేసుకున్న బిజెపి నేత కొలన్ శంకర్ రెడ్డి ఆ గణనాథుడి లడ్డూను బాలాపూర్ గ్రామములోని ప్రతి ఇంటికి, మరియు ఇతర ప్రాంత ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు మీడియా ప్రతినిధులకు లడ్డూ ప్రసాదమును పంపిణీ చేయడం జరిగినది

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)

# వైద్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ ల నిర్వహణ



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలం పరిధిలోని ఎర్ర పహాడ్ యడవెల్లి తాళ్ళ సింగారం గ్రామపంచాయతిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గ్రామపంచాయతీ సిబ్బంది అందరికీ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎల్.చరణ్ గ్రామ పంచాయతీల కార్యదర్శులు రాగి చలమయ్య,సుధాకర్ ఏఎన్ఎం యన్.పుష్పలత,ఆశా కార్యకర్తలు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్రలేఖనంలో లార్డ్స్ విద్యార్థికి జిల్లా స్థాయిలో మొదటి బహుమతి




**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల లో గల చిన్న జీయర్ స్వామి ఆశ్రమంలో నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖనంలో బడంగ్పేట్ లోని లార్డ్స్ ఒలంపియాడ్ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని కుమారి సుష్మ చిత్రలేఖనంలో రంగారెడ్డి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సిద్ధాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల యొక్క ప్రతిభాపాటవాలను వెలికి తీసి వారిని వెన్నంటి ప్రోత్సహించడంలో లార్డ్స్ విద్యా సంస్థలు ఎప్పుడు ముందు వరుసలో ఉంటాయని తెలిపారు. లార్డ్ ఒలింపియాడ్ ప్రిన్సిపల్ బానూరు శ్రీనివాస్ రెడ్డి విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

# అలుగు దాటుతుండగా జారిపడి వ్యక్తి మృతి...!!

### మోమిన్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన...!!



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** చెరువు అలుగు దాటుతుండగా జారి నీటిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మోమిన్ పేట్ పరిధిలో చోటు చేసుకుంది.మోమిన్ పేట్ ఎస్ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి.మంగళవారం మోమిన్పేట్ మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన మన్నె రాములు (53) పని కోసం వెళ్తూ చెరువు అలుగు దాటుతుండగా ప్రమాదవశాత్తు జారి నీళ్లలో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య మన్నె లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అరవింద్ తెలిపారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు


# సింగరేణి కార్మికుల,కాంట్రాక్ట్ కార్మికుల లాభాల బోనస్ : తక్షణమే చెల్లించాలి

## అధికారులను ఆదేశించిన సంస్థ సీ&ఎండీ ఎన్.బలరామ్

**మందమరి టౌన్ సెప్టెంబర్ 24 క్రైమ్ మిర్రర్:** రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇటీవల ప్రకటించిన 33 శాతం లాభాల వాటా బోనస్ ను వచ్చే నెల 9వ తేదీన చెల్లించేందుకు యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేస్తుందని అమెరికా నుంచి వీసీ ద్వారా సంస్థ సీ%ಡ%ఎండీ ఎన్.బలరామ్ మంగళవారం ఉదయం సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలు, కార్పోరేట్ జీఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు.ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు,మంత్రివర్గ సభ్యులు, సింగరేణి సంస్థ 2023- 24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన నికర లాభాలలో 33 శాతాన్ని అనగా 796 కోట్ల రూపాయలను లాభాల వాటా బోనస్ గా ప్రకటించారు. సింగరేణి చరిత్ర లో ఇది అత్యధికం కావడం విశేషం. సంస్థలో పనిచేస్తున్న సుమారు 42 వేల మంది అధికారులు, కార్మికులకు ఈ లాభాల వాటాను పంపిణీ చెయ్యనున్నామని అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో తాము పనిచేసిన పని దినాల సంఖ్య ను పరిగణనలోకి తీసుకొని లాభాల వాటా బోనస్ చెల్లిస్తామని తెలిపారు.సగటున ఒక్కొక్కరు సుమారు లక్షా తొంభై వేల రూపాయల చొప్పున లాభాల వాటా బోనస్ ను పొందే అవకాశం ఉందన్నారు. తొలిసారిగా కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా సింగరేణి లో పని చేస్తున్న దాదాపు 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు లాభాల వాటా బోనస్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా విధి విధానాలను రూపొందించాలని అన్నారు.ముఖ్యంగా ఆర్థిక సంవత్సరంలో వివిధ కాంట్రాక్టర్ల వద్ద పనిచేసిన వారి వివరాలు, వారి సమాచారాన్ని పూర్తిగా సేకరించాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా పండుగకు ముందే వారికి కూడా బోనస్ చెల్లింపు జరిగేలా




చూడాలని అన్నారు.ఈ నెల జీతంతో పండుగ అడ్వాన్సు ఒక్కొక్కరికి రూ.25 వేలు లాభాల వాటా బోనస్ తో పాటు సింగరేణి సంస్థ ఎప్పటి లాగానే ఈ ఏడాది కూడా దసరా పండుగ అడ్వాన్స్ ను సింగరేణి ఉద్యోగులకు చెల్లించాలని తెలిపారు. ఒక్కొక్కరికి 25 వేల రూపాయల పండుగ అడ్వాన్స్ ను చెల్లిస్తామని దీని కోసం సంస్థ 95 కోట్ల రూపాయలను కేటాయించినట్లు తెలిపారు. సెప్టెంబరు నెల జీతాలతోపాటే ఈ పండుగ అడ్వాన్స్ సొమ్మును కూడా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.లాభాల వాటా బోనస్ పండుగ అడ్వాన్స్ చెల్లింపుకు రంగం సిద్ధం చేశామని తెలిపారు.



# సాంఘిక సంక్షేమ గురుకులంలో న్యూట్రిషన్ మాసం వేడుకలు

### ప్రిన్సిపాల్ రమ కల్యాణి

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి,క్రైమ్ మిర్రర్ :** సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల లక్షెట్టిపేట ప్రిన్సిపాల్ రమ కల్యాణి అధ్యక్షతన న్యూట్రిషన్ నెలలో భాగంగా మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమ కల్యాణి మాట్లాడుతూ, ఫ్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్ విద్యార్థులకు ఉద్యోగ శిక్షణ లో భాగంగా మాన్యువల్ నైపుణ్యాల కోసం సెప్టెంబర్ మొదటి వారంలో రక్త హీనత పై,రెండవ వారంలో ఎదుగుదల, పర్యవేక్షణ,నాలుగవ వారంలో పోషన్ భీ. పఢై భీ. ఐదవ వారం పర్యావరణ పరిరక్షణ, ఎక్ పెడ్ మామకే నామ్, సెప్టెంబర్ నెలలో ఆహార పోషక విలువల ప్రాధాన్యతను వివరించే కార్యక్రమాలను నిర్వహించటం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో ఒకేషనల్ విద్యార్థులు పోషక విలువల ప్రాధాన్యతను వివరిస్తూ చేసిన ఎక్ పెడ్ మా కె నామ్ నాటక ప్రదర్శన, వారు చేసిన నృత్యాలు, ఉపన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జూనియర్ వి.పి. శ్రీలత.సూపరింటెంట్ రామకృష్ణ,ఒకేషనల్ అధ్యాపకులు గీతాంజలి,దివ్య, వినయ్, సాయి శిరీష, కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న జిఎం దేవేందర్



**మందమర్రి టౌన్ సెప్టెంబర్ 24 క్రైమ్ మిర్రర్:** కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు స్వచ్ఛత ప్రత్యేక కార్యక్రమాలు మంగళవారం స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో ని పరిసరాలలో చెత్తను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు.ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్ ముఖ్య అతిధిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛత ప్రత్యేక కార్యక్రమం 4.0 లో భాగంగా పని స్థలాలలో పరిసరాల పరిశుభ్రత, కార్యాలయాలు, కాలనీల సుందరీకరణ మొదలైన కార్యక్రమాలను నిర్వహించుకోవడం జరుగుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఐటియుసి మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సి ఎం ఓ ఏ ఐ అధ్యక్షులు రమేష్, వై వెంకటరమణ డివైజియం ఈ అండ్ ఎం, ఎన్విరాన్మెంటల్ అధికారి ప్రభాకర్, డీజీఎం సివిల్ శ్రీనివాసులు, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సివిల్ ఎస్ . ఇ జయప్రకాష్, డివైపిఎం ఎండి ఆసిఫ్, సివిక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమీక్ష. .సమావేశం



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, క్రైమ్ మిర్రర్, బెల్లంపల్లి నియోజకవర్గం కు సంబందించిన అభివృద్ధి కార్యక్ర మాలకు సంబందించిమంగళవారం సమీకృత జిల్లా కార్యాలయంలో బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ...ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ , డి ఎఫ్ ఓ బెల్లంపల్లి ఆర్డీవో , జిల్లా ఉన్నతా అధికారాలు, నియోజకవర్గ స్థాయి అధికారులు , తదితరులు పాల్గొన్నారు

# బ్యాంకింగ్ ఫైనాన్స్ ఇన్సురెన్స్ రంగంలో ఉద్యోగాలు

### బీఎఫ్ఎస్ఐ నైపుణ్య శిక్షణను అందించే వినూత్న కార్యక్రమం

### నేడు ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో ఈ ఏడాది డిగ్రీ, ఇంజనీరింగ్ లో చేరిన విద్యార్థులకు బ్యాంకింగ్ ఫైనాన్స్ ఇన్సురెన్స్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. రెగ్యులర్ డిగ్రీతో పాటు మినీ డిగ్రీ కోర్సుగా బీఎఫ్ఎస్ఐ నైపుణ్య శిక్షణను అందించే వినూత్న కార్యక్రమాన్ని ఈ నెల 25న బుధవారం ప్రారంభిస్తోంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ కార్యక్రమాన్ని ఆవిష్కరిస్తారు. ఉన్నత విద్యామండలి గుర్తించిన 18 ఇంజనీరింగ్ కాలేజీలు, 20 డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న 10 వేల మంది విద్యార్థులకు ఈ శిక్షణను అందించనుంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మేలు జరిగేలా ఈ కాలేజీలను ఎంపిక చేసింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక జాబ్ డిమాండ్ ఉన్న బీఎఫ్ఎస్ఐ సంస్థలకు అవసరమైన నిపుణులను తీర్చిదిద్దేందుకు ఈ కోర్సు ఉపయోగపడుతోంది. అత్యంత ఖరీదైన ఈ కోర్సును డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉచితంగా అందించనుండటం విశేషం. ఈ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ తీసుకోనున్న 10 వేల మంది విద్యార్థుల వివరాలతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రత్యేక పోర్టల్ రూపొందిస్తోంది. విద్యార్థుల బయోడేటాతో పాటు చదువుతున్న కాలేజీ, వారి విద్యార్హతలు, సాంకేతిక కోర్సుల అనుభవం వివరాలన్నీ అక్కడ పొందుపరుస్తారు. బీఎఫ్ఎస్ఐ రంగంలో పేరొందిన కంపెనీలు తమకు అవసరమైన ఉద్యోగులను ఎంపిక చేసుకునేందుకు ఈ పోర్టల్ వారధిగా పని చేస్తుంది. బీఎఫ్ఎస్ఐ కంపెనీలు ఈ పోర్టల్లో ఉన్న విద్యార్థులతో నేరుగా వీడియో కాల్ ద్వారా ఇంటర్వ్యూ చేసే వీలుంటుంది. దీంతో డిగ్రీ, ఇంజనీరింగ్ లో చేరిన విద్యార్థులకు చదువుతో పాటు ఉద్యోగ భరోసాకు ప్రభుత్వం కొత్త బాటలు వేసింది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సహకారంతో బీఎఫ్ఎస్ఐ కన్సార్టియం మినీ డిగ్రీ కోర్సుకు అవసరమైన సిలబస్ రూపొందించింది. ప్రభుత్వంపై ఆర్థిక భారం లేకుండా సీఎస్ఆర్ నిధులను సమీకరించి మూడేండ్ల పాటు ఈ శిక్షణను అందించేలా మంత్రి శ్రీధర్?బాబు బీఎఫ్ఎస్ఐ సంస్థల ప్రతినిధులతో పలుమార్లు సంప్రదింపులు జరిపారు. ఇఖిజఎఖఖఖ అనే సంస్థ ఈ ప్రోగ్రాంకు రూ.2.50 కోట్లు అందించేందుకు ముందుకు వచ్చింది. విద్యార్థులకు ఉపాధి కల్పించేలా జీసీసీలకు, ప్రభుత్వానికి అనుసంధాన కర్తగా ఉండటంతో పాటు సీఎస్ఆర్ నిధులను సమీకరించనుంది.

# పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయండి

### మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పదినెలల తర్వాత పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించిందని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తున్నామని.. ఇప్పటికైనా మిగిలిపోయిన ప్రాజెక్ట్ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. మంగళవారం తెలంగాణ భవన్లో శ్రీనివాస్ గౌడ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... 90శాతం ప్రాజెక్టు పనులు కేసీఆర్ హయాంలోనే జరిగాయని శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. వలసల పాలమూరు జిల్లాను మాజీ సీఎం కేసీఆర్ పచ్చబడేలా చేశారని చెప్పారు. పాలమూరులో లక్షల ఎకరాలను కొత్తగా సాగులోకి తెచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని చెప్పారు. తాము పిలిచిన టెండర్లు కొనసాగించి ఉంటే పాలమూరు రంగారెడ్డి ఇప్పటికే పూర్తయ్యేదని అన్నారు. గతంలో అభివృద్ధిలో వెనుకబడ్డ పాలమూరును చూయించి ప్రపంచ బ్యాంక్ నుంచి అప్పులు తెచ్చేవారని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం భేషజాలకు పోకుండా పాలమూరు పథకం వెంటనే పూర్తి చేయాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీ కూడా పాలమూరు రంగారెడ్డిలో పనులు చేసిందని శ్రీనివాస్ గౌడ్ గుర్తుచేశారు. పాలమూరు ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న మంత్రులు.. ఎప్పుడు పూర్తి చేస్తారో స్పష్టంగా చెప్పాలని అన్నారు. మంత్రుల పర్యటన పాలమూరు రైతులకు భరోసా ఇచ్చేదిగా ఉండాలని శ్రీనివాస్గౌడ్ కోరారు. మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన వారేనని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో ప్రాజెక్టుల పురోగతి జూపల్లికి తెలుసునని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అధ్యయనానికి త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ బృందం తమిళనాడు వెళ్తుందని శ్రీనివాస్గౌడ్ వెల్లడించారు.



# హైద్రాబాద్ బహిరంగ సభకు తరలిన మునుగోడు రేషన్ డీలర్లు

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** హైదరాబాద్ పటాన్ చెరులో రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభకు మునుగోడు రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఉడుత సైదులు ఆధ్వర్యములో స్వచ్ఛందంగా తరలివెళ్ళారు..అధ్యక్షుడు ఉడుత సైదులు మాట్లాడుతూ..2023 ఎమ్మెల్యే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రతి రేషన్ డీలర్ కు నెలకు 5 వేళ రూపాయలు గౌరవ వేతనం ఇవ్వాలని,రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.మునుగోడు మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# లేమురులో విద్యుత్ తో యువకుడు మృతి

### పేపర్ ప్లేట్లు చేస్తుండగా ప్రమాద వషాత్తు విద్యుత్ ఘతుకానికి బలైన సాయి కుమార్

### తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించిన ఇన్స్పెక్టర్ సీతారాం



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ మండలం, లేమురు గ్రామానికి చెందిన కందికంటి సాయి కుమార్ బాబయ్య, (22) గత నాలుగు సంవత్సరాల నుండి అదే గ్రామములో ఒక షట్టరు అద్దెకు తీసుకుని అందులో విస్తారాకుల మిషన్(పేపర్ ప్లేట్)సహాయముతో ప్లేట్లు తయారు చేసి విక్రయించేవాడు.మంగళవారం రోజు మాదిరిగానే ఉదయం



సాయి కిరణ్ తన షాపుకు వెళ్లి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురి అయి, విస్తారంటలు చేసే మిషన్ మీద పడి ఉండగా అతని బావ అయిన కిషన్ మధ్యాహ్నం షాపు వద్దకు వెళ్లి చూడగా సాయి కుమార్ అప్పటికే విద్యుత్ షాక్ వలన చనిపోయి విగత జీవిగా పడి ఉన్నాడు.ఈ విషయమై కందుకూర్ పోలీసులకు సమాచారమివ్వగా సంఘటన స్థలానికి చేరుకొని మృతుని తండ్రి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ సీతారాం తెల్పినారు.



# ఇంటికీ బీమా రక్షణ

గృహమే కదా స్వర్గసీమ అన్నారు పెద్దలు. మరి ఆ ఇంటికీ రక్షణ ఉండాలి కదా. అందుకే ఇండ్లకూ ఇన్సూరెన్స్‌లొచ్చేశాయ్. గృహ బీమాను ప్రాపర్టీ ఇన్సూరెన్స్ లేదా హోమ్ ఓనర్ ఇన్సూరెన్స్‌గా కూడా పిలుస్తారు. ఎక్స్‌టీరియర్-ఇంటీరియర్ డ్యామేజీలకు కవరేజీనిస్తుంది. ఇంట్లోని వస్తుసామాగ్రికి కూడా బీమా రక్షణ లభిస్తుంది. ఇంట్లో దురదృష్టవశాత్తూ జరిగే ఏదైనా ప్రమాదాలకూ వర్తిస్తుంది.

హోమ్ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని ఎస్బీఐ, శ్రీరామ్ జనరల్, బజాజ్ అలియాంజ్, భారతీ యాక్సా, రాయల్ సుందరం, రిలయన్స్, రహేజా క్యూబీఈ, ఓరియంటల్, న్యూ ఇండియా అష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరాలీ, చోళమండలం వంటి సంస్థలు అందిస్తున్నాయి. ఇండ్ల యజమానులు, అద్దెకుండేవారు ఈ బీమాను తీసుకోవచ్చు. కొన్ని సంస్థలు హౌజింగ్ సొసైటీలకూ బీమాను కల్పిస్తున్నాయి. తీవ్రవాదుల దాడి, భూకంపాల్లో ధ్వంసమైనా బీమాను ఇస్తామని మరికొన్ని సంస్థలు ప్రకటిస్తున్నాయి.

**కవరేజీ ఇలా..**

షరతులు, ప్రీమియంలనుబట్టి ఆయా సంస్థలు.. అగ్ని ప్రమాదాలు, డాక్యుమెంట్ల నష్టం, దొంగతనాలు, గృహోపకరణాల డ్యామేజీ, వ్యక్తిగత ప్రమాద బీమా, అద్దె ఎగవేత, పెంపుడు జంతువుల సంరక్షణ, ఇల్లు పూర్తిగా దెబ్బతింటే ప్రత్యామ్నాయ వసతి ఖర్చులు, బ్యాగేజీ నష్టం, థర్డ్ పార్టీ-ఎంప్లాయ్ లయబిలిటీస్, ఎలక్ట్రికల్ ఫెయిల్యూర్ కవరేజీలను అందిస్తున్నాయి. ఇంట్లోని విలువైన ఎలక్ట్రిక్-ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫర్నీచర్, ఆభరణాలకూ బీమా కవరేజీ ఉంటుంది. ప్రకృతి విపత్తుల్లో ధ్వంసమైనా, అల్లర్లతో ప్రభావితమైనా ఇన్సూరెన్స్‌ను పొందవచ్చు. ఒకవేళ గృహ రుణం పరిధిలో ఇల్లు ఉన్నట్టైతే ప్రీమియంలు అధికంగా ఉంటాయి.

**పాలసీ కాలపరిమితి**

గృహ బీమా పాలసీలు దీర్ఘకాలానికిగాను కొనుక్కోవచ్చు. అలాగే కనిష్ఠంగా ఏడాది కాలపరిమితితో కూడా తీసుకోవచ్చు. ఇండిపెండెంట్ హౌజ్‌లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లకు అనుగుణంగా ఈ పాలసీల కవరేజీని ఎంచుకోవచ్చు. నివాస ప్రాంతాన్నిబట్టి, పాలసీ వ్యవధి ఆధారంగా ప్రీమియంలుంటాయి. అయితే వాటిల్లిన నష్టానికి కారణం ఉద్దేశపూర్వక చర్యేనని తేలితే బీమా వర్తించదు.



# మదుపర్లూ అప్రమత్తత అవసరం

## మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు ఆల్‌టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకే పెద్దపీట వేస్తున్నారు. గత వారం ట్రేడింగ్‌లో శుక్రవారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,360, నిఫ్టీ 375 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీగానే ఎగిశాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,653.37 పాయింట్లు ఎగబాకి తొలిసారి 84వేల మార్కును దాటి ఆల్‌టైమ్ హై 84,544.31 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 434.45 పాయింట్లు ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 25,790.95 దగ్గర ముగిసింది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందంటూ మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉన్న విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 25,400 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 26వేల మార్కును నిఫ్టీ తాకవచ్చు. 26,100-26,400 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**చివరగా..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

# ఆన్‌లైన్‌లో వస్తువులు కొంటున్నారా?

ఆఫర్ల సీజన్ వచ్చేస్తోంది. ప్రముఖ ఇ- కామర్స్ సంస్థలు సేల్స్ తేదీలను ప్రకటించేశాయి. మరికొన్ని రోజుల్లో సేల్స్ కూడా మొదలుకానున్నాయి. దీంతో ఇప్పటికే చాలా మంది తాము కొనాల్సిన ప్రొడక్టులను కార్ట్‌లో యాడ్ చేసుకుంటున్నారు. డీల్స్ మొదలవ్వడమే తరువాయి ఆర్డర్ పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి సేల్స్ సమయంలో ఉత్పత్తులు తక్కువ ధరకు లభిస్తుంటాయి. వాస్తవంలో కొన్ని వస్తువుల ధరలను సేల్‌కు ముందు పెంచేసి.. తర్వాత తగ్గించినట్లు చూపిస్తూ ఉంటారు. ఇది తెలియక ఆఫర్ సమయంలో తక్కువ ధరకు కొనేసినట్లు కొందరు సంబరపడిపోతుంటారు. అందుకే ఫలానా వస్తువు అసలు ధర ఎంత? ఏ సమయంలో తక్కువ ధరకు విక్రయించారు? ప్రస్తుతం తగ్గింపుతోనే విక్రయిస్తున్నారా? ఈ విషయాలన్నీ తెలియాలంటే వాటి ప్రైస్ హిస్టరీ తెలుసుకోవాల్సిందే. అదెలా?

**యాప్‌లోనే..**

ఇ- కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో ఏదైనా ప్రొడక్ట్‌ను వెతుకుతూ అక్కడే దాని ప్రైస్ హిస్టరీ (%ుాతీఱఎవ ష్ట్రఱర్‌శీతీ%) తెలుసుకోవచ్చు. దీని కోసం యాప్ బయటకు రావాల్సిన అవసరం కూడా లేదు. దీని కోసం మీ మొబైల్‌లో ప్రైస్ హిస్టరీ ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏ షాపింగ్ ప్లాట్‌ఫామ్‌లో అయినా మీకు కావల్సిన ప్రొడక్ట్‌ను ఓపెన్ చేసి పక్కనే ఉన్న షేర్ ఆప్షన్‌పై క్లిక్ చేసి ఇంతకు ముందు ఇన్‌స్టాల్ చేసిన యాప్‌ను ఎంచుకోవాలి. అంతే యాప్ నుంచి బయటకు రాకుండా అక్కడే ఓ పాప్‌అప్ అవుతుంది. అందులో మీకు ఆ వస్తువు ప్రైస్ హిస్టరీ కనిపిస్తుంది. గరిష్ఠ ధర, కనిష్ఠ ధర, ఎప్పుడెప్పుడు ఆ వస్తువు ధర తగ్గింది? ఇలా అన్ని విషయాలు అక్కడే ఓ చార్ట్‌లో కనిపిస్తాయి. రానున్న రోజుల్లో ఈ ప్రొడక్ట్ ధర తగ్గే అవకాశం ఉందా? అనే విషయం కూడా తెలుస్తుంది. ఇతర ప్లాట్‌ఫామ్‌లలో ఆ వస్తువు ధర ఎంత ఉందనేది కూడా %జూవీూా=జు% లో తెలుసుకోవచ్చు. ఫలానా వస్తువు ధర తగ్గిందని తెలుసుకునేందుకు అక్కడే అలర్ట్‌ను సెట్ చేసుకోవచ్చు. ఎక్స్‌టెన్షన్ సాయంతోనూ ప్రైస్ హిస్టరీ తెలుసుకోవచ్చు. అమెజాన్‌లో అయితే keepa ఎక్స్‌టెన్షన్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ ఎక్స్‌టెన్షన్‌ను బ్రౌజర్‌కు యాడ్ చేసిన తర్వాత ప్రొడక్ట్‌ను ఓపెన్ చేసి కిందకు స్క్రోల్ చేయగానే ఓ చార్ట్ దర్శనమిస్తుంది. అందులో ఏ రోజు ఎంతెంత ధర ఉందో స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవేళ ఫ్లిప్‌కార్ట్‌లో అయితే PRICE HISTORY అనే ఎక్స్‌టెన్షన్‌ను మీ బ్రౌజర్‌కు యాడ్ చేసుకోవాలి. అచ్చం అమెజాన్ తరహాలోనే ఇక్కడ కూడా ప్రైస్ చార్ట్ కనిపిస్తుంది. దీని కోసం ప్రత్యేకంగా వేరే వెబ్‌పేజ్‌కు వెళ్లాల్సిన పనిలేదు.



# రుసుము పెడితే యూపీఐ వాడబోం

దిల్లీ: టీ బడ్డీ నుంచి హాస్పిటల్స్‌లో బిల్లుల చెల్లింపు దాకా.. రోజువారీ ఆర్థిక లావాదేవీలకు అత్యధికంగా వినియోగిస్తోంది యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) పద్ధతినే. క్యూఆర్ కోడ్ స్కానింగ్ లేదా మొబైల్ నంబరు వినియోగించి, ఎలాంటి రుసుములు లేకుండా ఒకరి నుంచి మరొకరికి డబ్బులు సులభంగా, వేగంగా పంపించుకుంటున్నారు. ఇందువల్ల చిల్లర సమస్య గణనీయంగా తగ్గింది. యూపీఐ లావాదేవీలపై రుసుము విధిస్తారనే ఊహాగానాలు రేగుతున్న దశలో.. జులై 15-సెప్టెంబరు 20 మధ్య ఆన్‌లైన్ పద్ధతిలో 308 జిల్లాల్లోని 42,000 మంది నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు లోకల్ సర్కిల్స్ తెలిపింది. యూపీఐ లావాదేవీ రుసుములకు సంబంధించిన ప్రశ్నకు 15,598 స్పందనలే వచ్చాయి. ఛార్జీలు విధిస్తే, యూపీఐ సేవలను వినియోగించడం ఆపేస్తామని 75 శాతం మంది ప్రజలు తేల్చిచెప్పారని ఆ సంస్థ వెల్లడించింది. ఒకవేళ రుసుము విధించినా, చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని 22% మంది పేర్కొన్నారు.

# ఆర్థిక లక్ష్యాలకు అవరోధాలివే..



ప్రతీ ఒక్కరికీ వారివారి ఆర్థిక లక్ష్యాల సాధనకు నగదే ప్రధానం. కానీ ఆ నగదు పొదుపు విషయంలో అనేక అడ్డంకులు వస్తున్నాయి. అందుకే పట్టుదల, క్రమశిక్షణ, సరైన వ్యూహాలుండాలి. అప్పుడే ఫైనాన్షియల్ గోల్స్ సాకారం కాగలవు. అసలు ఆర్థిక లక్ష్యాల సాధనను ఏవి పక్కదారి పట్టిస్తున్నాయో చూస్తే..క్రమశిక్షణ లేకపోవడం వల్ల ఆర్థిక లక్ష్యాల సాధన జటిలంగా మారుతుంది. ఉదాహరణకు మార్కెట్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్ కనిపించిందని, ఇప్పుడున్న ఫోన్ బాగున్నా కొనేయడం అక్షరాలా దుబారానే. అలాగే అనవసరపు టూర్లతోనూ లేనిపోని ఖర్చే. ఇలాంటివన్నీ చాపకింద నీరులా మీ ఆర్థిక లక్ష్యాలను దెబ్బతీస్తాయని మరువద్దు.

ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకొని మన ఆదాయాలను పెంచుకుంటూపోవాలి. లేకపోతే మన సంపాదన, పొదుపును పెరిగే ధరలు మింగేస్తాయి. అది పిల్లల చదువుకయ్యే ఖర్చులు కావచ్చు లేదా మనం కొనాలనుకునే ఇల్లు కావచ్చు ఏదైనాసరే రోజులు గడుస్తున్నకొద్దీ మరింత ఎక్కువగా నగదును పెట్టాల్సి వస్తుందని మరువద్దు.

అత్యవసరాలు

జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేం. ముఖ్యంగా వైద్యవసరాలు ఎలా ఉంటాయో కూడా తెలియదు. అనుకోని ఆరోగ్య సమస్యలతో కూడా ఆర్థిక లక్ష్యాలు దెబ్బతింటాయి.

**మార్కెట్ ఒడిదొడుకులు**

మార్కెట్‌లో నెలకొనే ఒడిదొడుకులు కూడా ఆర్థిక లక్ష్యాలకు ఆటంకమే. పెట్టిన పెట్టుబడుల్లో రాబడులు తగ్గి అనుకున్న స్థాయిలో నగదు సమీకరణలు కష్టమవుతాయి. కాబట్టి మన చేతిలో లేనివాటికి మనం ఏమీ చేయలేం. ఉన్నవాటికైనా జాగ్రత్తతో ముందుకెళ్తే అనుకున్నది సాధిస్తాం.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188



# పారా షట్లర్లకు నజరానా

ఢిల్లీ: ఇటీవలే పారిస్ వేదికగా ముగిసిన పారాలింపిక్స్‌లో భాగంగా బ్యాడ్మింటన్‌లో భారత్‌కు ఐదు పతకాలు అందించిన పారా షట్లర్లకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) రూ. 50 లక్షల నగదు రివార్డును ప్రకటించింది. బ్యాడ్మింటన్ క్రీడలో భారత్‌కు ఒక స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు దక్కాయి. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 కేటగిరీలో బంగారు పతకం సాధించిన నితేశ్ కుమార్‌కు రూ. 15 లక్షలు దక్కగా వెండి కాంతులు పంచిన సుహాస్ యతిరాజ్ (ఎస్ఎల్ 4), తులసిమతి మురుగేశన్ (మహిళల సింగిల్స్ ఎస్‌యూ5)కు తలా రూ. 10 లక్షలు అందనున్నాయి. ఇక కాంస్యాలు సాధించిన అమ్మాయిలు మనీషా రామదాస్ (ఎస్‌యూ5), నిత్యశ్రీ శివన్ (ఎస్‌హెచ్6)కు తలా ఒక్కరికి రూ. 7.5 లక్షలు దక్కనున్నాయి.

# సత్తా చాటుతాం

## మెగాటోర్నీ సన్నాహాల్లో ముందున్నాం

## టీ20 వరల్డ్‌కప్‌పై హర్మన్‌ప్రీత్



ముంబై: ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో సత్తాచాటుతామని భారత మహిళల కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ ధీమా వ్యక్తం చేసింది. వచ్చే నెల 3వ తేదీ నుంచి యూఏఈ వేదికగా మొదలవుతున్న మెగాటోర్నీ కోసం మంగళవారం టీమ్‌ఇండియా బయల్దేరి వెళ్లింది. ఇన్నాళ్లు అందని ద్రాక్షగా ఊరిస్తూ వస్తున్న టీ20 ప్రపంచకప్‌ను ఈసారైనా ఒడిసిపట్టుకోవాలన్న పట్టుదలతో ఉన్న భారత్ ఆ దిశగా ముందుకెళుతున్నది. యూఏఈకి వెళ్లే ముందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్‌తో పాటు చీఫ్ కోచ్ అమోల్ మజుందార్, చీఫ్ సెలెక్టర్ నీతూ డేవిడ్ పాల్గొన్నారు. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్‌లో టీ20 ప్రపంచకప్ జరుగాల్సి ఉన్నా..అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా టోర్నీని యూఏఈకి మారుస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. మెగాటోర్నీలో భాగంగా భారత్ తమ తొలి మ్యాచ్‌లో అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో తలపడనుంది. 2009లో మొదలైన ఈ మెగాటోర్నీలో భారత్ ఇప్పటి వరకు ఒక్కసారే(2020) ఫైనల్ చేరుకోగా, గతేడాది సెమీఫైనల్లోనే నిష్క్రమించింది. ఏండ్లుగా అందకుండా పోతున్న పొట్టి కప్‌ను ఈసారి ఒడిసిపట్టుకునేందుకు భారత్ తహతహలాడుతున్నది.

**సన్నాహాల్లో ముందున్నాం:** టీ20 ప్రపంచకప్‌పై హర్మన్‌ప్రీత్ స్పందిస్తూ 'యూఏఈలో త్వరలో జరుగబోయే టీ20 వరల్డ్‌కప్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ఆసియా కప్‌లో చేదు అనుభవం తర్వాత మా లోపాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ముఖ్యంగా ఒత్తిడిని ఎదుర్కొంటూ ఎలా రాణించాలనే దాన్ని ప్రాధాన్యంగా తీసుకున్నాం. దూకుడుకు మారుపేరైనా టీ20ల్లో పరిస్థితులకు తగ్గట్లు ఆటతీరు మార్చుకోవాల్సి ఉంటుంది. గత టోర్నీలకు భిన్నంగా ఈసారి అన్ని విభాగాల్లో జట్టు సత్తాచాటుతుందన్న నమ్మకం నాకుంది. యువ క్రికెటర్లకు తోడు అనుభవజ్ఞులు ఉండటం జట్టుకు కలిసిరానుంది. జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లో గత 10 రోజులుగా కఠిన శిక్షణ తీసుకున్నాం. ముఖ్యంగా ఫిట్‌నెస్, ఫీల్డింగ్‌లో మెరుగయ్యేందుకు చెమటోడ్చాం. ఇప్పటి వరకు చాలా మెగాటోర్నీలు ఆడిన అనుభవం నాకుంది. 19 ఏండ్ల వయసు నుంచి ఇప్పటి వరకు చాలా టోర్నీల్లో భాగమయ్యాను. టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ నుంచి బాగా పోటీ ఎదురయ్యే అవకాశముంది. ఐసీసీ ఈవెంట్లలో మమ్మల్ని ఎలా ఓడించాలో ఆసీస్‌కు బాగా తెలుసు. కానీ వారిని ఓడించే ఏకైక జట్టు భారత్ అన్న సంగతి వారికి కూడా తెలుసు' అని ఉంది. మజుందార్ మాట్లాడుతూ గత పది రోజలుగా ఎన్‌సీఏలో ఫిటనెస్, ఫీల్డింగ్‌పై బాగా దృష్టి పెట్టామన్నాడు.



# కాన్పూర్ టెస్టుకు భద్రత పెంపు

కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ మధ్య ఈనెల 27 నుంచి కాన్పూర్ వేదికగా జరగాల్సి ఉన్న రెండో టెస్టుకు పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసను నిరసిస్తూ 'అఖిలేష్ భారతీయ హిందు మహాసభ' ఆధ్వర్యంలో పలువురు ఆందోళనకారులు నిరసనకు దిగడంతో పాటు మ్యాచ్‌ను జరుగనివ్వబోమని హెచ్చరించిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మ్యాచ్ జరిగే గ్రీన్ పార్క్ స్టేడియానికి సమీపంలో ఆందోళనకు దిగిన ఈ గ్రూప్ సభ్యులలో 20 మందిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. అంతేగాక బంగ్లాదేశ్ జట్టుకు అదనపు భద్రతను సమకూర్చుతున్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. మంగళవారమే కాన్పూర్ చేరుకున్న ఇరు జట్ల ఆటగాళ్లూ స్థానికంగా ఉన్న లాండ్‌మార్క్ హొటల్‌లో స్టే చేస్తుండగా హొటల్ వద్ద భద్రతను పెంచినట్టు కాన్పూర్ అడిషినల్ కమిషనర్ హరీష్ చందర్ తెలిపారు.

# అందరూ మహిళలే...

### నారీమణుల ఆధ్వర్యంలోనే టి20 ప్రపంచకప్ నిర్వహణ

### టాస్ నుంచి రిఫరీ నిర్ణయాల దాకా వనితలకే అధికారం

### రిఫరీల బృందంలో ఆంధ్ర మహిళ జీఎస్ లక్ష్మి

దుబాయ్: ఒక క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు 11ం11 మంది ప్లేయర్లు సరిపోతారు. కానీ ఆటకు ముందు, ఆట నిర్వహణ, ఆట తర్వాత 'ప్రత్యక్ష ప్రసారాని'కి కంటబడని పనెంతో ఉంటుంది. దీన్ని పదులు, వందల సంఖ్యలో సిబ్బంది కంటికి రెప్పలా కనిపెట్టుకొని మరీ పనిచేస్తారు. టాస్ ప్రతినిధి, పిచ్ వద్ద బ్రాడ్‌కాస్టర్ తొలి వ్యాఖ్యానం, టీవీ వ్యాఖ్యాతల వాక్చాతుర్యం, అంపైర్లు బంతిని పట్టుకొని మైదానంలోకి దిగడం. తర్వాత ఫీల్డింగ్ జట్టు గుండ్రంగా ఒకరి భుజాలపై ఒకరు చేతులు వేసుకొని చేసే ప్రతిజ్ఞ... అనంతరం మెల్లిగా ఓపెనర్ల ఆగమనం, సెకన్ల కౌంట్‌డౌన్‌తో మ్యాచ్ షురూ! మధ్యలో విరామం... గ్రౌండ్‌సిబ్బంది పిచ్‌ను చదును చేయడం, ఆకస్మికంగా వర్షం పడితే కవర్లు పట్టుకొని పదుల సంఖ్యలో మైదానాన్ని కవర్ చేయడం, మ్యాచ్ రిఫరీ పర్యవేక్షణ ఇలా ఓ పెద్ద బృందమే మ్యాచ్‌ను మనముందుకు తెస్తుంది. క్రికెట్ అంటే ఫోర్, సిక్సర్, అవుట్, డకౌట్, ఎల్బీడబ్ల్యూ మాత్రమే కాదు... అంతకుమించిన శ్రమ, ప్రణాళికాబద్ధమైన నిర్వహణ ఉంటాయి. ఇదివరకే గత టి20 ప్రపంచకప్ బాధ్యతల్ని మహిళల బృందమే నిర్వహించడంతో ఇకపై కూడా అదే ఆనవాయితీని కొనసాగించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిర్ణయించింది. మొత్తం మీద ఐసీసీ అతివలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడమే కాదు... గురుతర బాధ్యతలను కూడా పెట్టింది. తద్వారా ప్రపంచానికి ప్రపంచకప్‌తో నారీశక్తిని చాటే అవకాశమిచ్చింది.

# ఇక ప్రపంచ చాంపియన్‌షిప్‌పై దృష్టి

## ఒలింపియాడ్ స్ఫూర్తితో రాణిస్తా: గుకేశ్

## భారత్ చేరిన చెస్ విజేతలకు బ్రహ్మరథం



చెన్నై: చెస్ ఒలింపియాడ్ స్ఫూర్తితో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్‌పై దృష్టి కేంద్రీకరిస్తానని భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ చెప్పాడు. నవంబర్‌లో జరిగే ఈ మెగా ఈవెంట్ కోసం పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతానని తెలిపాడు. డిఫెండింగ్ చాంపియన్, చైనీస్ గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌తో భారత ఆటగాడు ప్రపంచ చాంపియన్‌గుకేశ్ ప్ టైటిల్ కోసం తలపడతాడు. ఈ టోర్నీకి ఇంకా రెండు నెలల సమయం ఉండటంతో ఫామ్‌ను కాపాడుకునేందుకు... ఎత్తుల్లో ప్రావీణ్యం సంపాదించేందుకు కావాల్సినంత సమయం లభించిందని చెప్పాడు. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 15 వరకు సింగపూర్‌లో గుకేశ్, లిరెన్‌ల మధ్య ప్రపంచ పోరు జరుగుతుంది. ఏప్రిల్‌లో క్యాండిడేట్స్ టోర్నమెంట్ గెలుపొందడం ద్వారా ఈ మెగా టోర్నీకి గుకేశ్ అర్హత సంపాదించాడు. 18 ఏళ్ల ప్రపంచ చాంపియన్‌షిప్ చాలెంజర్ హంగేరిలో ముగిసిన చెస్ ఒలింపియాడ్‌లో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా పురుషుల టీమ్ విభాగంలో సహచరులు వెనుకబడిన ప్రతి సందర్భంలో కీలక విజయాలతో జట్టును అజేయంగా నిలపడంలో గుకేశ్ పాత్ర ఎంతో ఉంది. ఒలింపియాడ్‌పై మాట్లాడుతూ 'ఈ టోర్నీని నేను ఒక వ్యక్తిగత ఈవెంట్‌గా భావించాను. కాబట్టే ప్రతి గేమ్‌లో ఇతరుల ఫలితాలతో సంబంధం లేకుండా స్వేచ్ఛగా ఆడేందుకు ప్రయత్నించాడు. ఒలింపియాడ్‌లో నా ప్రదర్శన నాకెంతో సంతృప్తినిచ్చింది. జట్టు ప్రదర్శన కూడా బాగుంది' అని అన్నాడు. తాజా ఫలితం తమ సానుకూల దృక్పథానికి నిదర్శనమని అన్నాడు. భారత ఆటగాళ్లంతా సరైన దిశలో సాగుతున్నారని చెప్పుకొచ్చాడు. అంతకుముందు బుడాపెస్ట్ నుంచి చెస్ ఒలింపియాడ్ విజేతలు తమ తమ స్వస్థలాలకు చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన గుకేశ్, ప్రజ్ఞానంద, వైశాలి, పురుషుల జట్టు కెప్టెన్ శ్రీనాథ్ నారాయణ్‌లకు చెన్నైలో చెస్ సంఘం అధికారులు, అభిమానులు, కుటుంబసభ్యులు ఘన స్వాగతం పలికారు. పూల బోకేలతో స్వాగతం పలికిన అభిమానులు పలువురు గ్రాండ్‌మాస్టర్లతో సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. చెస్ ఒలింపియాడ్‌లో గతంలో ఉన్న కాంస్యం రంగు మార్చి బంగారు మయం చేయడం చాలా సంతోషంగా ఉందని ప్రజ్ఞానంద అన్నాడు. అతని సోదరి వైశాలి మాట్లాడుతూ సొంతగడ్డపై జరిగిన గత ఈవెంట్‌లో కాంస్యంతో సరిపెట్టుకున్న తమ పసిడి కల తాజాగా హంగేరిలో సాకారమైందని హర్షం వ్యక్తం చేసింది. వంతిక అగర్వాల్, తానియా సచ్‌దేవ్‌లకు ఢిల్లీ చెస్ సంఘం అధికారులు, హైదరాబాద్‌లో ద్రోణవల్లి హారికకు భారత స్పోర్ట్స్ అథారిటీ అధికారులు స్వాగతం పలికి సన్మానం చేశారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

## కర్నాటక సిఎం సిద్దరామయ్యకు హైకోర్టులో చుక్కెదురు

### ముడా విచారణపై గవర్నర్ నిర్ణయానికి సమర్థన

**బెంగుళూరు, (క్రైమ్ మిర్రర్):** కర్నాటక సీఎం సిద్ధరామయ్యకు.. హైకోర్టులో చుక్కెదురైంది. ముడా స్కామ్‌లో సీఎంను విచారించాలని గవర్నర్ థావర్ చాండ్ గెహ్లాట్ చేసిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సిద్ధరామయ్య కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ ఎం నాగప్రసన్న నేతృత్వంలోని బెంచ్ ఈ కేసులో తీర్పును ఇచ్చింది. గవర్నర్ గెహ్లాట్ వ్యక్తిగత నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నదని, ఆయన పూర్తిగా మెదడు పెట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్లు జస్టిస్ నాగప్రసన్న తెలిపారు. అందుకే సీఎంను ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్ తీసుకున్న నిర్ణయంలో ఎటువంటి లోపం లేదని హైకోర్టు తెలిపింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో సుమారు 14 సైట్లను అక్రమ రీతిలో సీఎం సిద్దరామయ్య భార్యకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో సీఎం సిద్దును విచారించాలని గవర్న్ గెహ్లాట్ ఆదేశాలు ఇచ్చారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం, భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 218 ప్రకారం.. సీఎంను విచారించే అవకాశాలు ఉన్నట్లు గవర్నర్ తన ఆదేశాల్లో తెలిపారు. సిద్ధరామయ్య తరపున ప్రముఖ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీ, ప్రొఫసర్ రవివర్మ కుమార్ వాదించారు. ఇక గవర్నర్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అడ్వకేట్ జనరల్ శశి కిరణ్ షెట్టి తమ వాదనలు వినిపించారు.



## ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం మార్గదర్శకాలు

### రైతుసేవా కేంద్రాలు, ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఏపీ ప్రభుత్వం రైతులకు శుభవార్త తెలిపింది. వికేంద్రీకరణ విధానంలో ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రైతుసేవా కేంద్రాలు, ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని ఈ-పంట, ఈ కేవైసీ ద్వారా రైతులు, కౌలు రైతుల వివరాలను ధాన్యం కొనుగోళ్లకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ అనుసంధానంతో ఇ-పంట , ఈ -కేవైసీ ద్వారా రైతుల ఖాతాల్లోకి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏపీ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థలు రాష్ట్రస్థాయి ధాన్యం కొనుగోళ్లకు నోడల్ సంస్థలుగా పనిచేస్తాయని స్పష్టం చేసింది. ధాన్యం కొనుగోలు లావాదేవీల్లో ఉన్న రైస్ మిల్లర్లు కూడా ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో నమోదు కావాలని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన కనీస మద్దతు ధర కామన్ వెరైటీ క్వింటాలుకు రూ.2300 , గ్రేడ్ ఏ రకానికి రూ.2320 క్వింటాలుకు చెల్లించాలని తెలిపింది. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశిరచుకున్నట్టు స్పష్టం చేసింది. సేకరణతో సహా, మిల్లింగ్ ఆపరేషన్లపై పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లు, జేసీలను ఆదేశిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఆర్టీసీ చైర్మన్‌గా మాజీ ఎంపి కొనకళ్ల

### పలు కార్పోరేషన్ల పదవులు భర్తీ.. ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఏపీలో పలు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 20 కార్పొరేషన్లకు ఛైర్మన్లు, సభ్యులను నియమించింది. ఈ నియమకాల్లో తెదేపాతో పాటు భాజపా, జనసేన నేతలకు ప్రాధాన్యం కల్పించారు. ఆర్టీసీ ఛైర్మన్‌గా తెదేపా మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను ప్రభుత్వం నియమించింది. వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా అబ్దుల్ అజీజ్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా లంకా దినకర్, శాప్ ఛైర్మన్‌గా రవినాయుడును ఎంపిక చేసింది. మొత్తం 99 మందితో జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రభుత్వం చోటు కల్పించింది. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడిన సామాన్య కార్యకర్తలకు సీఎం చంద్రబాబు ఈ జాబితాలో పెద్దపీట వేశారు. యువతకు ప్రాధాన్యం కల్పించారు. 11 మంది కస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, ఆరుగురు యూనిట్ ఇన్‌చార్జ్‌లకు పదవులు దక్కాయి. ఓ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌కు ఛైర్మన్ పదవి వరించింది. కార్పొరేషన్- ఛైర్మన్‌ల వివరాలు ఇలా ఉన్నాయి. వక్ఫ్‌బోర్డు- అబ్దుల్ అజీజ్ (తెదేపా), శాప్- అనిమిని రవి నాయుడు(తెదేపా), గృహనిర్మాణ సంస్థ- బత్తుల తాతయ్యబాబు(తెదేపా),ఏపీ ట్రైకార్- బొరగం శ్రీనివాసులు (తెదేపా), ఏపీ మారిటైం బోర్డు- దామచర్ల సత్య (తెదేపా), సీడాప్- దీపక్‌రెడ్డి (తెదేపా), 20 సూత్రాల అమలు కమిటీ- లంకా దినకర్ (భాజపా),మార్క్‌ఫెడ్- కర్రోతు బంగార్రాజు (తెదేపా),సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్- మన్నె సుబ్బారెడ్డి (తెదేపా), ఏపీఐఐసీ- మంతెన రామరాజు (తెదేపా)పద్మశాలి కార్పొరేషన్- నందం అబద్ధయ్య (తెదేపా), ఏపీటీడీసీ- నూకసాని బాలాజీ (తెదేపా), ఏపీఎస్ ఆర్టీసీ- కొనకళ్ల నారాయణ, వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం (తెదేపా),పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కార్పొరేషన్- పీలా గోవింద సత్యనారాయణ (తెదేపా),లెదర్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్- పిల్లి మాణిక్యాల రావు (తెదేపా), వినియోగ దారుల రక్షణ కౌన్సిల్- పీతల సుజాత (తెదేపా), ఎంఎస్‌ఎంఈ- తమ్మిరెడ్డి శివశంకర్ (జనసేన), పౌరసరఫరాల కార్పొరేషన్- తోట మెహర్ సీతారామ సుధీర్ (జనసేన), ఏపీటీపీసీ- వజ్జ బాబూరావు (తెదేపా),ఏపీ టిడ్కో- వేములపాటి అజయ్‌కుమార్ (జనసేన)లను నియమించారు.

# తిరుమల లడ్డూ వ్యవహారం

## ప్రకాశ్ రాజ్, కార్తీలకు పవన్ కళ్యాణ్ హెచ్చరిక

## సారీ మమ్మలను అపార్థం చేసుకున్నారంటూ సమాధానం

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** తిరుమల లడ్డూపై నటుల వ్యాఖ్యలకు డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఘాటు వ్యాఖ్యలు చేయడంతో వారు సర్దుకుంటున్నారు. తాజాగా మంగళవారం పవన్ నటుడు ప్రకాశ్ రాజ్, కార్తీలపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీంతో వారు వెంటనే స్పందించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రస్తుతం తాను విదేశాల్లో ఉన్నానని, ఇండియాకు వచ్చాక పవన్ కళ్యాణ్ ప్రశ్నలకు సమాధానమిస్తానని ప్రకాశ్ రాజ్ అన్నారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. పవన్ కళ్యాణ్ గారు.. ఇప్పుడే మీ ప్రెస్‌మీట్ చూశా. నేను చెప్పిన దాన్ని మీరు అపార్థం చేసుకున్నారు. ప్రస్తుతం నేను విదేశాల్లో షూటింగ్‌లో ఉన్నా. ఈ నెల 30 తర్వాత ఇండియాకు వచ్చి మీ ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతా. ఈలోగా మీకు వీలుంటే నా ట్వీట్‌ను మళ్లీ చదవండి. అర్థం చేసుకోండని పేర్కొన్నారు. ప్రకాశ్‌రాజ్.. విషయం తెలుసుకుని మాట్లాడండి.. సున్నితాంశాలపై నటుడు ప్రకాశ్‌రాజ్ విషయం తెలుసుకుని మాట్లాడాలి. ఆయనతో పాటు అందరికీ చెబుతున్నా.. విమర్శలకు ముందు ఏం జరిగిందో తెలుసుకోండి. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు అని పవన్ వ్యాఖ్యానించారు.తిరుమల శ్రీనువాసుడి లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంలో మద్దతు పలకకుండా అపహాస్యంగా మాట్లాడిన వారినూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మండిపడ్డ సంగతి తెలిసిందే. ఇకపోతే సోమవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన సత్యం సుందరం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కార్తి లడ్డూ విషయం సెన్సిటివ్ అని, ఇప్పుడు ఆ విషయం మనకొద్దని యాంకర్‌కు సమాధానం ఇచ్చారు. దీనిపై మంగళవారం ఉదయం పవన్‌కల్యాణ్ స్పందించారు. 'కుదిరితే మద్దతు పలకండి.. కానీ హిందూ ధర్మాన్ని అపహాస్యం చేయొద్దు' అంటూ కార్తీకి కౌంటర్ ఇచ్చారు. దీంతో కార్తీ స్పందించారు. పవన్ కళ్యాణ్ సర్ మీకు నా క్షమాపణలు అంటూ ట్వీట్ చేశారు కార్తీ. పవన్‌కల్యాన్ సర్ మీరంటే నాకు ఎంతో గౌరవం ఉంది. నేను అనుకోకుండా మాట్లాడిన మాటల్లో ఇలా అపార్థాలు ఏర్పడినందుకు నేను క్షమాపణ కోరుతున్నా. నేనూ వేంకటేశ్వర స్వామికి భక్తుడినే. ఎల్లప్పుడూ మన సంప్రదాయాలను గౌరవిస్తాను అని కార్తీ ట్వీట్‌లో పేర్కొన్నారు.



# మహిళలకు అండగా నిలవండి

### నెలసరి సెలవులు తప్పనిసరి

### ఐక్యరాజ్యసమితో గళమెత్తిన ప్రియదర్శిని

**న్యూయార్క్, (క్రైమ్ మిర్రర్):** నెలసరి రోజుల్లో మహిళలకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలంటూ ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఒడిశాకు చెందిన సామాజిక ఉద్యమకారిణి రంజితా ప్రియదర్శిని గళం విప్పారు. అప్పుడే మహిళలు జీతంలో కోత పడుతుందని ఆలోచించకుండా సెలవు తీసుకోగలుగుతారని వెల్లడించారు. అమెరికాలో న్యూయార్క్ నగరంలో 79వ సర్వసభ్య ప్రతినిధి సభలో 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నెలసరి విషయంలో సమాజంలో ఉన్న అపోహలను తొలగించేందుకు ఆమె కృషి చేస్తున్నారు.రెండోసారి ఐరాస సదస్సుకు హాజరైనందుకు గర్వంగా ఉంది. నెలసరి రోజుల్లో వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్నదే నా ప్రధాన లక్ష్యం. ఆ రోజుల్లో ఒకటి నుంచి రెండు రోజులు సెలవులు ఇవ్వాలి. జీతం ఇవ్వకపోతే.. ఏ మహిళ కూడా ఆ సెలవు తీసుకోదు. కెన్యాలో జరిగిన ఐరాస సదస్సులో తొలిసారి ఈ విషయం గురించి ప్రస్తావించానని ప్రియదర్శిని తెలిపారు. కెన్యా సదస్సు అనంతరం ఒడిశా ప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకుందని ఆమె తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి పెయిడ్ పీరియడ్ లీవ్ ఇన్షియేటివ్‌ను అమలుచేసింది. అలాగే కర్ణాటక ప్రభుత్వం ఏడాదికి ఆ తరహాలో ఆరు సెలవులు ప్రకటించింది. కర్ణాటక ప్రభుత్వం చర్యను అభినందించిన ఆమె.. ఆ సెలవుల సంఖ్యను 12కు పెంచాలని కోరారు. తన పోరాటం వెనక వ్యక్తిగతంగా ఎదుర్కొన్న అనుభవాలు కారణమని ఆమె తెలిపారు. ఆ సమయంలో తాను సెలవు కోరినందుకు తన మేనేజర్ నుంచి అవమానం ఎదుర్కొన్నానని, ఆ తర్వాత తాను ఉద్యోగానికి రాజీనామా చేశానని వెల్లడించారు. ఆమె ప్రయత్నాలు నెలసరి ఆరోగ్యం గురించి చర్చించేలా, ఆ దిశగా నిర్ణయాలు తీసుకునేందుకు దోహదం చేస్తున్నాయి. ఇదిలాఉంటే.. స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఒడిశా ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పిన సంగతి తెలిసిందే. ఉద్యోగినుల కోసం ఒక రోజు నెలసరి సెలవు పాలసీని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఇది వర్తిస్తుందని వెల్లడించింది. ఈ పాలసీ తక్షణమే అమల్లోకి వస్తుందని అప్పట్లో ప్రభుత్వం పేర్కొంది. మహిళా ఉద్యోగులు ప్రతినెలా తమ రుతుక్రమంలో తొలి లేదా రెండో రోజు ఈ సెలవును తీసుకునేలా దీన్ని రూపొందించినట్లు తెలిపింది. ఉద్యోగుల ఆరోగ్యం, శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

## భారత్‌కు బాగా దగ్గరైన ప్రధాని మోడీ

### అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి కీలక వ్యాఖ్యలు

**న్యూయార్క్, (క్రైమ్ మిర్రర్):** భారత ప్రధాని అమెరికా పర్యటన సందర్భంగా అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశ చరిత్రలో అమెరికాకు బాగా దగ్గరైన ప్రధాని మోదీ అని, యూఎస్ చరిత్రలో భారత్‌కు బాగా దగ్గరైన అధ్యక్షుడు బైడెన్ అని ఆయన కొనియాడారు. ఇరు దేశాల ప్రజలకు ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న వీరిరువురి మధ్య చాలా స్నేహపూరిత సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యానికి, సంబంధాలకు వీరి మధ్య ఉన్న స్నేహమే కారణమని పొగిడారు. భారత్ అమెరికా మధ్య పెరుగుతున్న స్నేహపూర్వక సంబంధాలు రెండు దేశాల్లో వ్యూహాత్మక, ఆర్థిక, సాయుధ, సాంస్కృతిక సహకారంలో వృద్ధికి సహకరిస్తాయని గార్సెట్టి అన్నారు. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లు సభ్యదేశాలుగా ఉన్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సును ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సహకారానికి శక్తివంతమైన వేదికగా పేర్కొన్నారు.క్వాడ్ సదస్సు సభ్యదేశాల మధ్య ఒక విజన్, అభివృద్ధి, సహకారం, సమస్యల పరిష్కారం గురించి చర్చించే వేదిక. ఇండో-పసిఫిక్ సమస్యలకు పరిష్కారాలను రూపొందించడానికి మేము చురుగ్గా పని చేస్తున్నాం అని గార్సెట్టి పేర్కొన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నివాసంలో క్వాడ్ సదస్సు నిర్వహించారు. ఇందులోభాగంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భాగస్వామ్య ఆందోళనలు, వ్యూహాలు, కూటమిలో భాగస్వాముల మధ్య సహకారం, భవిష్యత్తులో వేయాల్సిన అడుగులపై సదస్సులో నేతలు సమగ్రంగా చర్చించారు. సముద్రయాన భద్రత, లాజిస్టిక్స్ వ్యవస్థ, మానవతా సాయాన్ని బలోపేతం చేయడం, విపత్తుల సమయంలో పునరావాస చర్యల్లో సహకరించుకోవడంపైనా చర్చించుకున్నారు. సదస్సు సందర్భంగా 'విల్మింగ్టన్ డిక్లరేషన్' పేరుతో సభ్యదేశాల నేతలు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. నాలుగు దేశాల కూటమి బలం మునుపటి కంటే పెరిగిందని క్వాడ్ పేర్కొంది. మానవ హక్కుల పరిరక్షణ, చట్టబద్ధ పాలన, ప్రజాస్వామ్య విలువలు, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలకు కట్టుబడి ఉంటామని, ఐరాస సహా ఎలాంటి ప్రపంచ వేదికల ద్వారా బలప్రయోగానికి పాల్పడబోమని పేర్కొంది. ప్రధాని మోదీ విడివిడిగా జపాన్ ప్రధాని ఫుమియో కిషిద, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌లతో సమావేశమయ్యారు. మౌలిక సదుపాయాలు, సెమీకండక్టర్లు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారం గురించి చర్చించారు.

# త్వరలోనే టిటిడి పాలకమండలి నియామకం

### కసరత్తు చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

### అన్ని ఆలయాల్లో నాణ్యమైన సరుకులతో ప్రసాదాలు


### దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** త్వరలోనే టీటీడీ పాలకమండలి నియామకం జరుగుతుందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బోర్డు నియామకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసరత్తు చేస్తున్నారన్నారు. టీటీడీ పాలకమండలితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27 వేల దేవాలయాల పాలకమండళ్లను త్వరలోనే నియమిస్తామని ప్రకటించారు. లడ్డు వివాదం ముగిసిన అంశం అని.. తదుపరి సిట్ దర్యాప్తు నిర్వహిస్తుందని తెలిపారు. సిట్ నివేదిక వచ్చిన తరువాత విజిలెన్స్, సిట్ నివేదికలపై ప్రభుత్వం పరిశీలన జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటుందని చెప్పారు. తిరుమల ఆలయంతో పాటు రాష్ట్రంలోని 7 ప్రధాన ఆలయాల్లో సోమవారం శాంతి హోమం, సంప్రోక్షణ కార్యాక్రమాలను నిర్వహించామన్నారు. ఃూష్ట్రంలోని మిగతా ఆలయాల్లో కూడా శాంతి హోమం, సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించామని అన్నారు. నాణ్యమైన ముడిసరుకులతో శ్రీవారికి ప్రసాదాలు సమర్పించాలని ఇప్పటికే సీఎం ఆదేశించారన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో నెయ్యితో పాటు ముడిసరుకులను పరిశీలించి..నాణ్యతని పరిశీలించాకే వినియోగించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఉత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించామని.. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. వెంకటగిరి పోలేరమ్మ జాతర, కన్యాకా పరమేశ్వరి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు నివేదికలు స్పష్టం చేశాయి. దీంతో ఈ అంశాన్ని చంద్రబాబు ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. ఈ వ్యవహారాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం సాయంత్రం లోపు అందుకు సంబంధించిన జీవోను జారీ చేయాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం. కాసేపటి క్రితం సచివాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి.. డీజీపీ ద్వారకా తిరుమల రావు, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ మహేశ్ చంద్ర లడ్హా, ఐజీ లా అండ్ ఆర్డర్ శ్రీకాంత్, ఏపీఎస్పీ డీఐజీబీ.రాజా కుమారిలతో సమావేశమయ్యారు. తిరుపతి లడ్డూ ప్రసాదంపై సిట్ ఏర్పాటు , అనంతపురం లో రథం దగ్ధం, తాజా శాంతి భద్రతల అంశాలపై సీఎం చర్చించినట్లు తెలుస్తోంది. మరి కాసేపట్లో సిట్‌లో ఎవరెవరు ఉండనున్నరో వెల్లడిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. మరోవైపు ఇదే అంశంపై సోమవారం రాత్రి సీఎం చంద్రబాబుతో డీజీపీ ద్వారకా తిరుమల రావు, ఇంటెలిజెన్స్ చీఫ్ లడ్డా సమావేశమై చర్చించారు.

# కన్నడ చిత్రంలోనూ.. వేధింపులు

## నటి నీతూశెట్టి ఆరోపణలతో కలకలం



మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపుల గురించి జస్టిస్ హేమ కమిటీ రూపొందించిన రిపోర్ట్ ఇప్పుడు అన్ని భాషల్లోనూ కలకలం రేపుతోంది. ఈనేపథ్యంలోనే కన్నడ చిత్ర పరిశ్రమలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని నటి నీతూశెట్టి షాకింగ్ ఆరోపణలు చేశారు. తాజాగా ఓ జాతీయ మీడియాతో మాట్లాడిన ఆమె కొన్ని కీలక విషయాలు బయటపెట్టారు. కన్నడ చిత్రపరిశ్రమలోనూ మహిళలు వేధింపులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. వాటిని బయటకు రానివ్వరు. గతంలో ఒక నిర్మాత నాతో ఇబ్బందికరంగా ప్రవర్తించాడు. సినిమా చర్చలో భాగంగా ఆయన్ని కలిశాను. సినిమా గురించి పక్కన పెట్టి హాలీడే కోసం తనతో గోవాకు రమ్మని పిలిచాడు అని నీతూశెట్టి ఆరోపించారు. 'కన్నడ చిత్ర పరిశ్రమలో నటించిన ఏ నటినైనా అడగండి. వాళ్ల దగ్గర చెప్పడానికి తప్పకుండా ఒక వేధింపుల కథ ఉంటుంది' అని మరో నటి ఆరోపించారు. అయితే తాను ఎవరి వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నది చెప్పాలనుకోవడం లేదన్నారు. జస్టిస్ హేమ కమిటీ వంటి కమిటీలు అన్నిచోట్లా ఉండాలని, అప్పుడే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయని ఆమె వివరించారు. దాదాపు ఏడేళ్లపాటు శ్రమించి జస్టిస్ హేమ కమిటీ ఈ నివేదికను సిద్ధం చేసింది. మలయాళ సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వర్కింగ్ కండిషన్లు, రెమ్యూనరేషన్, సాంకేతిక రంగంలో మహిళల భాగస్వామ్యం తదితర అంశాలను అధ్యయనం చేసిన కమిటీ.. కాస్టింగ్ కౌచ్ మొదలు వివక్ష వరకు మాలీవుడ్‌లో మహిళలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఈ నివేదికలో వెల్లడించిన పలు అంశాలు అంతటా తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈనేపథ్యంలోనే నటీమణులకు ఎలాంటి సమస్యలు ఉన్నాయనే అంశాలు తెలుసుకోవడంపై పలు చిత్ర పరిశ్రమలు దృష్టిపెట్టాయి. ఇటీవల కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆ పరిశ్రమకు చెందిన తారలతో సమావేశం నిర్వహించి వారికి ఎలాంటి పరిస్థితులు ఉన్నాయనే విషయాన్ని అడిగి తెలుసుకుంది.

# బయటే రక్షణ లేదు!

మలయాళ సినీరంగంపై జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ అనంతరం ఫిల్మ్ ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్ అంశాలు మరోసారి తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై పలువురు సినీ తారలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కన్నడ భామ శ్రద్ధా శ్రీనాథ్ సినీరంగంలో క్యాస్టింగ్ కౌచ్, మహిళల భద్రత గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. సినీరంగంలో క్యాస్టింగ్ కౌచ్ జరిగేది నిజమేనని, అయితే తాను మాత్రం అలాంటి చేదు అనుభవాలను ఎప్పుడూ ఎదుర్కోలేదని చెప్పింది. నిజం చెప్పాలంటే సినీరంగంలో కంటే బయటి సమాజంలోనే మహిళలకు రక్షణ కరువైందని అభిప్రాయపడింది. 'ఈ విషయాన్ని అందరూ ఒప్పుకోవాలి. సమాజంలో మహిళలపై దారుణమైన నేరాలు జరుగుతున్నాయి. ఒంటరిగా కారులో వెళ్లాలంటే భయపడే పరిస్థితులు ఉన్నాయి. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేస్తూ ధైర్యంగా ఉండలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి' అని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పుకొచ్చింది. నానితో కలిసి నటించిన 'జెర్సీ' సినిమాతో ఈ భామ తెలుగులో మంచి గుర్తింపును సంపాదించుకుంది. అనంతరం వెంకటేష్ సరసన 'సైంధవ్' చిత్రంలో కూడా నటించింది.





# పూనం కౌర్ ఆరోపణలపై ఫిలిం చాంబర్ స్పదంన

నేరుగా లేదా..మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచన గత రెండు రోజులుగా జానీ మాస్టర్ వివాదం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. టాలీవుడ్ లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి జానీ మాస్టర్ మీద ఆరోపణలు రాగానే వివాదం తేలే వరకు అతన్ని డాన్సర్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని ఫెడరేషన్‌ను ఆదేశించామని అన్నారు. తాజాగా.. ఫిలిం ఛాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. మహిళల భద్రత విషయంలో టాలీవుడ్ మిగతా చిత్ర పరిశ్రమల కంటే ఎంతో ముందుందని, వర్క్ ప్లేస్ లో అమ్మాయిలకు వేధింపులు ఉంటే ఖచ్చితంగా ఎంత పెద్దవారినైనా మేము విచారిస్తాం అన్నారు. పూనమ్ కౌర్ కమిటీలో రిపోర్ట్ చేయకుండా.. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఉపయోగం లేదని, వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరికి ఎంత ఇన్ ఫ్లూయెన్స్ ఉన్నా.. కమిటీ విచారణ మాత్రం న్యాయబద్దంగా జరుగుతుందన్నారు. ప్రభుత్వ తరపునుంచి గైడ్ లైన్స్ వస్తే కమిటీకి మరింత బలం చేకూరుతుందన్నారు. ఇదిలాఉండగా.. లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారు,ఎదుర్కొంటున్న వారు టీఎఫ్‌సీసీకి ఎనీ టైం ఫిర్యాదు చేయాలని ఒక ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీసు వద్ద ఉదయం 6గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కంప్లైంట్ బాక్స్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, డి.రామానాయుడు బిల్డింగ్ కాంప్లెక్స్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ – 500096 చిరునామాకు పోస్టుద్వారా అయినా ఫిర్యాదు చేయవచ్చుని తెలిపింది. ఫోన్ నంబరు : 98499 72280కు ఫిర్యాదు ఇవ్వొచ్చని విజ్ఞప్తి చేసింది.

# దేవర.. రామాయణం స్ఫూర్తితో తీసారేమో

## ట్రైలర్ చూసి అంచనా వేసిన రచయిత పరుచూరి



ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దేవర' భారీ అంచనాల మధ్య దసరా కానుకగా 27న ప్రపంచవ్యాప్తంగా అది ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల విడుదలైన దీని ట్రైలర్ మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. తాజాగా ఈ ట్రైలర్‌పై ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడారు. 'దేవర' టీమ్‌కు శుభాకాంక్షలు చెబుతూ ప్రత్యేక వీడియో విడుదల చేశారు. 'రావణాసురుడి కోసం రాముడు సముద్రాన్ని దాటిన ఘట్టాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇందులో కొన్ని సన్నివేశాలు రూపొందించారేమో అని అనిపించింది. రాముడు సముద్రాన్ని దాటినట్లు 'దేవర'లోనూ ఎన్టీఆర్ పడవపై నిల్చొని సముద్రాన్ని దాటుతున్నట్లు చూపించారు. సముద్ర తీరపాత్రం నేపథ్యంలో ఇది రానుంది. ఇందులో మా చిన్నరామయ్య (ఎన్టీఆర్) పాత్రలో గమ్మత్తులు ఉన్నట్లు అర్థమవుతోంది. దేవర, భైరవగా కనిపించ నున్నాడు. దేవర అంటే హీరో అని అర్థమవుతోంది. మరి భైరవ విలన్ వైపు ఉంటాడేమో అనిపించింది. అలానే హీరోయిన్‌తో సరదాగా, అమాయకత్వంగా మాట్లాడడం చూస్తే.. కొరటాల శివ తన స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకుల ఆలోచనలతో ఆడుకోవడం ఖాయం అనిపిస్తుంది. 'రక్తంతో సముద్రం ఎరుపెక్కే కథ..' అని అన్నారు. అంటే సముద్రంలోనే యుద్ధం జరుగుతుందని ఓ డైలాగుతో చెప్పారు. 'మనిషికి బతికేంత ధైర్యం చాలు.. చంపేంత కాదు' అని డైలాగ్ ఉంది. ఈ డైలాగుతో ఎన్నో ఆలోచనలు కలిగించారు. 'దేవరని చంపాలంటే సరైన సమయమే కాదు.. సరైన ఆయుధమూ దొరకాలి' అన్నారు. రామాయణంలోనూ రాముడు ఎన్నో బాణాలు ఉపయోగించాడు. అలానే ఇందులోనూ ఎన్నో ఆయుధాలు ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఇందులోని ప్రతీ అంశం రామాయణాన్ని పోలి ఉంటుందనిపిస్తుంది' అని పరుచూరి గోపాలకృష్ణ అన్నారు 'దేవర' సూపర్ హిట్ అవ్వాలని ఆయన కోరుకున్నారు.

# తెలుగు మూవీతె కరీనా ఎంట్రీ ?



సినీ పరిశ్రమలో దాదాపు 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు నటి కరీనా కపూర్ .కెరీర్ ఆరంభం నుంచి బాలీవుడ్‌లోనే ఉన్న ఆమె ప్రస్తుతం దక్షిణాది సినిమాల్లోనూ నటించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలోనే ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ కోసం సంతకం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో మునుపెన్నడూ లేనివిధంగా అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఓ ప్రతిష్టాత్మక మూవీలో కరీనాకపూర్ భాగమయ్యారంటూ బీటౌన్‌లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈనేపథ్యంలోనే ప్రభాస్ 'స్పిరిట్' , మహేశ్ బాబు, రాజమౌళి ప్రాజెక్టులు తెరపైకి వచ్చాయి. ఆ రెండు చిత్రాల్లో ఒక దాని కోసం ఆమె సైన్ చేశారని టాక్. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న భారీ ప్రాజెక్ట్ 'స్పిరిట్'. సుమారు రూ.500 కోట్ల భారీ బ్జడెట్‌తో యాక్షన్ డ్రామాగా సిద్ధం కానుంది. ప్రభాస్ తొలిసారి పోలీస్ పాత్రలో అలరించనున్నారు. ఈ ఏడాది చివరిలో ఈ సినిమా షూటింగ్ మొదలుపెట్టే అవకాశం ఉంది. 2026లో విడుదల కానుంది. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా కరీనాకపూర్ కనిపించనున్నారని.. విలన్‌గా ఆమె భర్త, నటుడు సైఫ్ అలీఖాన్ నటించనున్నారని నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈమేరకు చర్చలు జరిగాయని సమాచారం. దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.